# ప్రజాశక్తి

సోమవారం 22 ఏప్రిల్ 2024 8 పేజీలు

గుంటూరు

పల్నాడు

# మంగళగిరి, గుంటూరు పశ్చిమదే ఆధిక్యం

- రెండు జిల్లాల్లో మహిళా ఓటర్లే అధికం
- పల్నాడు జిల్లాలో పెద్ద నియోజకవర్గంగా గురజాల
- తుది ఓటర్ల జాబితాలతో పోలింగ్‌కు సిద్ధం

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

వచ్చేనెల 13న జరగనున్న రానున్న సార్వత్రిక ఎన్నికల్లో ఓటు హక్కు వినియోగించుకునేందుకు గుంటూరు,పల్నాడు జిల్లాల్లోని ఓటర్లు సంసిద్ధమవుతున్నారు. గుంటూరు, నర్సరావుపేట పార్లమెంటు నియోజకవర్గాల్లోని 14 అసెంబ్లీ సెగ్మెంట్లలో ఓటర్లు స్వల్పంగా పెరిగారు. ఈఏడాది జనవరి 22వ తేదీన తుది జాబితా ప్రకటించిన తరువాత మళ్లీ ఇటీవల ఎన్నికల షెడ్యూలు వచ్చేవరకు ఓటర్ల. జాబితాల్లో మార్పులు, చేర్పులకు అవకాశం కల్పించారు. అంతేగాక గతంలో దాఖలు చేసిన ఫారం -7,8, ప్రకారం పెద్దసంఖ్యలో దరఖాస్తులు పెండింగ్‌లో ఉండటంతో ఎన్నికల కమిషన్ జోక్యం చేసుకుని వీటిని త్వరితగతిన పరిష్కరించాలని ఆదేశించడంతో అధికారులు గత నెల 31కి తుది ఓటర్ల జాబితాలను ప్రకటించారు. ఎన్నికల నోటిఫికేషన్ వచ్చిన తరువాత కూడా ఈనెల 15వ వరకు ఓటర్లుగా చేరేందుకు కొత్తవారికి అవకాశం కల్పించారు. గతనెల 31 వరకు నమోదు అయిన ఓటర్ల జాబితాల్లో వివరాలు ఇలాఉన్నాయి.

గుంటూరు లోక్‌సభ పరిధిలో ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల్లో 17,82,438 ఓటర్లు ఉన్నారు. వీరిలో 8,60,998 మంది పురుషులు, 9,21,333 మంది మహిళలు, 191 మంది థర్డ్ జండర్, 930 మంది ఓవర్సీస్ ఓటర్లు, 1780 సర్వీస్ ఓటర్ల నుంచి 1775కి తగ్గారు. ఉన్నారు. మార్చి 22న విడుదల చేసిన జాబితాల్లో గుంటూరు జిల్లాలో పురుషులు 8,55,262, మహిళలు 9,13,852 ఉన్నారు. పల్నాడు జిల్లాలో తాజా జాబితాల్లో మొత్తం 17,22,410 మంది ఉన్నారు. గత జనవరిలో విడుదల చేసిన జాబితా ప్రకారం పల్నాడు జిల్లాలో పురుషులు 8,37,200, మహిళలు 8,75,433 మంది ఉన్నారు. థర్డ్ జండర్ 190 మంది ఉన్నారు. మంగళగిరి నియోజకవర్గంలో అత్యధికంగా 2,90,430 మంది ఓటర్లతో ఉమ్మడిజిల్లాలోనే మొదటి స్థానంలో నిలిచింది. రెండో స్థానంలో 2,76,680 మంది ఓటర్లతో గుంటూరుపశ్చిమలో ఉంది. పల్నాడుజిల్లాలో గురజాల నియోజకవర్గంలో అత్యధికంగా 2,72,152 మందితో మొదటి స్థానంలో ఉంది. రెండు జిల్లాల్లో కలిపి దాదాపు 65 వేల మంది 18 ఏళ్లుదాటిన యువకులు ఈ సారి కొత్త ఓటర్లుగా చేరారు.

| నియోజకవర్గం | పురుషులు | మహిళలు | థర్డ్‌జండర్ | ఇతరులు | మొత్తం |
|---|---|---|---|---|---|
| తాడికొండ | 99,623 | 1,06,983 | 7 | 216 | 2,06,607 |
| మంగళగిరి | 1,39,710 | 1,50,707 | 13 | 136 | 2,90,430 |
| పొన్నూరు | 1,08,607 | 1,17,659 | 11 | 513 | 2,26,277 |
| తెనాలి | 1,28,349 | 1,37,801 | 33 | 289 | 2,66,183 |
| పత్తిపాడు | 1,28,525 | 1,37,803 | 23 | 364 | 2,66,351 |
| గుంటూరు వెస్టు | 1,34,838 | 1,41,937 | 43 | 158 | 2,76,680 |
| గుంటూరుతూర్పు | 1,21,484 | 1,28,443 | 33 | 99 | 2,49,960 |
| పెదకూరపాడు | 1,12,573 | 1,17,917 | 16 | -- | 2,30,506 |
| చిలకలూరిపేట | 1,07,768 | 1,17,469 | 49 | -- | 2,25,286 |
| నరసరావుపేట | 1,12,315 | 1,18,626 | 29 | -- | 2,30,970 |
| సత్తెనపల్లి | 1,17,693 | 1,22,850 | 12 | -- | 2,40,555 |
| వినుకొండ | 1,30,124 | 1,32,111 | 20 | -- | 2,62,255 |
| గురజాల | 1,32,492 | 1,39,618 | 42 | -- | 2,72,152 |
| మాచర్ల | 1,27,801 | 1,32,863 | 22 | -- | 2,60,686 |

# ఉద్యోగం వదిలి ఉద్యమ బాటలోకి

- సర్పంచ్‌గా 20 ఏళ్లపాటు అభివృద్ధికర గ్రామ పాలన
- ప్రజా సమస్యలపై నిత్యం ఆందోళనలు, ఉద్యమాలు
- చట్ట సభల్లోనూ పోరాడే అవకాశం కోసం ఎమ్మెల్యేగా పోటీ
- సిపిఎం మంగళగిరి అసెంబ్లీ నియోజకవర్గ అభ్యర్థి జొన్న శివశంకరరావు

ప్రజాశక్తి - మంగళగిరి

సమాజానికి సేవ చేయాలనే సంకల్పంతోనే ప్రభుత్వ ఉద్యోగాన్ని వదిలి రాజకీయాల్లోకి వచ్చానని ఇండియా బ్లాక్ తరుపున మంగళగిరి అసెంబ్లీ నియోజకవర్గానికి పోటీ చేస్తున్న సిపిఎం అభ్యర్థి జొన్న శివశంకరరావు అన్నారు. సోమవారం నామినేషన్ దాఖలు చేయనున్న ఆయన ఆదివారం ప్రజాశక్తితో మాట్లాడారు. పేదరైతు కుటుంబంలో పుట్టిన తాను చదువుకునే రోజుల్లో విద్యార్థి రాజకీయాల్లోనూ చురుగ్గా పని చేశానన్నారు. 1981లో ప్రభుత్వ ఉద్యోగం చేస్తున్న తాను కమ్యూనిస్టు నేతల ప్రసంగాలకు విని తన దృక్పథాన్ని మార్చుకున్నానని, ఉద్యోగం వదిలిపెట్టి రాజకీయాల్లోకి వచ్చి కమ్యూనిస్టుగా మారానని అన్నారు. దళితులపై జరుగుతున్న అణిచివేతలను, బలహీన వర్గాలపై జరుగుతున్న అత్యాచారాలను చూసి వాటిని ప్రతిఘటించాలని అనుకున్నట్లు చెప్పారు. ఉండవల్లిలో అన్నదమ్ములు లాగా కలిసిమెలసి జీవించాల్సిన జనాలు కులాల వారీగా చీలిపోయి కొట్లాడు కుంటున్న నేపథ్యంలో వారిలో

▶ 2లో

## నేడు సిపిఎం అభ్యర్థి జొన్న శివశంకర్‌రావు నామినేషన్

### హాజరుకానున్న సిపిఎం పొలిట్‌బ్యూరో సభ్యులు బివి రాఘవులు

మంగళగిరి అసెంబ్లీ నియోజకవర్గానికి ఇండియా వేదిక బలపరచిన సిపిఎం అభ్యర్థిగా జొన్న శివశంకర్‌రావు సోమవారం నామినేషన్ దాఖలు చేస్తారని సిపిఎం గుంటూరు జిల్లా కార్యదర్శి పాశం రామారావు ఆదివారం తెలిపారు. నామినేషన్ సందర్భంగా మంగళగిరిలోని చిల్లపల్లి కళ్యాణమండపంలో ఉదయం 10 గంటలకు బహిరంగ సభ ఉంటుందని, సభలో సిపిఎం పొలిట్‌బ్యూరో సభ్యులు బివి రాఘవులు, సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరరావు, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు లింగంశెట్టి ఈశ్వరరావు, గుంటూరు పార్లమెంట్ సిపిఐ అభ్యర్థి జంగాల అజయ్ కుమార్ పాల్గొని ప్రసంగిస్తారని తెలిపారు. అనంతరం చిల్లపల్లి కళ్యాణ మండపం నుండి ర్యాలీ ప్రారంభమవుతుందని, పాత మంగళగిరి, గాలిగోపురం అంబేద్కర్ సెంటర్ మీదగా మంగళగిరి కార్పొరేషన్ కార్యాలయానికి చేరుకుని అక్కడ జొన్న శివశంకర్‌రావు నామినేషన్ దాఖలు చేస్తారని తెలిపారు. కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు.

## ఈతకెళ్లిన ఇద్దరు విద్యార్థులు మృతి

ప్రజాశక్తి - నాదెండ్ల

ఈతకని వెళ్లి ఇద్దరు విద్యార్థులు మృత్యువాత పడిన ఘటన మండలంలోని తూబాడులో ఆదివారం చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన షేక్ సిద్దిక్ (12), షేక్ అక్తర్ (12) స్థానిక జెడ్‌పి పాఠశాలలో ఎనిమిదో తరగతి పూర్తి చేశారు. తాగునీటి అవసరాల నిమిత్తం సాగర్ నుండి నీటిని కాల్వలకు విడుదల చేసిన విషయం తెలిసిందే. వేసవి సెలవులు కావడంతో కాల్వలో ఈతకొట్టడానికని వీరిద్దరూ ఆదివారం తూబాబు-చిరుమామిళ్ల మధ్య ఉన్న పెదనందిపాడు బ్రాంచ్ కెనాల్‌కు మధ్యాహ్నం వెళ్లారు. ఈత కొడుతుండగా నీటి ఉధృతికి ఇద్దరూ కొట్టుకుపోయారు. వీరితోపాటు ఉన్న మరో వ్యక్తి ఇది గమనించి కాపాడే ప్రయత్నం చేసినా చాలా సేపటి వరకూ రక్షించలేకపోయారు. కొద్దిసేపటికి అతికష్టం మీద ఒడ్డుకు చేర్చి హుటాహుటిన ఆటోలో నరసరావుపేటలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి

షేక్ సిద్ధిక్, షేక్ అక్తర్ మృతదేహాలు

తరలించగా వారు అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. దీంతో గ్రామంలో విషాద ఛాయలు అలముకున్నాయి.

## రూ.4,60,880 వెండి సీజ్

ప్రజాశక్తి-గుంటూరు

జిల్లాలో సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ఆదివారం ఫ్లైయింగ్ స్క్వాడ్‌లు ఎన్నికల నియమావళి ఉల్లంఘనకు సంబంధించి నిర్వహించిన తనిఖీలలో తెనాలి నియోజకవర్గం పరిధిలో రూ.4,60,880లు విలువ గల 6584 గ్రాముల వెండి సీజ్ చేశారు. జిల్లాలో ఎన్నికల నేపథ్యంలో ఇప్పటి వరకూ రూ.2,31,26,840ల విలువైన నగదు, మద్యం, ఇతర వస్తువులను సీజ్ చేశారు.

ఆర్టీసీ బస్సులో తరలిస్తున్న ఆరున్నర కిలోల వెండిని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో వాహనాల తనిఖీల్లో భాగంగా రూరల్ పరిధిలో నందివెలుగు చెక్ పోస్ట్ వద్ద శనివారం రాత్రి ఆర్టీసీ బస్సులో తనిఖీలు చేశారు. విజయవాడ ఓ వెండి షాపులో పని చేస్తున్న వ్యక్తి వెండిని తరలించటాన్ని గుర్తించారు. దానికి సంబంధించి బిల్లులు, పత్రాలు లేకపోవటంతో వెండిని పోలీసులు స్వాధీనం చేసుకుని విచారణ చేపట్టారు.

## ప్రలోభాలకు లోనవ్వకుండా ఓటేయండి

### మాచర్ల నియోజకవర్గంలో జిల్లా ఎన్నికల అధికారి పర్యటన

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

ప్రలోభాలకు లోనుకాకుండా ఓటు హక్కును స్వేచ్ఛగా వినియోగించుకోవాలని వెల్దుర్తి మండలం కుంకుడు చెట్టు పెంట తండాలో గిరిజనులకు పల్నాడు జిల్లా ఎన్నికలాధికారి, కలెక్టర్ ఎల్.శివశంకర్ సూచించారు. మాచర్ల నియోజకవర్గంలోని ఈ తండాలో ఆదివారం నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి, జిల్లా జెసి శ్యామ్‌ప్రసాద్‌తో కలిసి పర్యటించిన కలెక్టర్ మాట్లాడుతూ అందరూ ఓటు హక్కును వినియోగించుకోవాలని

పాఠశాలలో రాత్రి బస చేసిన జిల్లా కలెక్టర్

కోరారు. అనంతరం మరసపెంట చెక్ పోస్టును తనిఖీ చేశారు. మండలంలోని గొట్టిపాళ్లలో సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలైను సందర్శించి అక్కడ సదుపాయాల ఏర్పాట్లను అడిగి తెలుసుకున్నారు. ఓటు హక్కు వినియోగంపై స్థానికులకు అవగాహన కల్పించారు. అనంతరం మందాడ జిల్లా పరిషత్ ప్రాథమిక పాఠశాలలో రాత్రి బస చేశారు.

## బీఫారం అందుకున్న టిడిపి అభ్యర్థులు

ప్రజాశక్తి - వినుకొండ

తనపై అచంచల నమ్మకంతో వరసగా 4వ సారి వినుకొండ నుంచి పోటీచేసే అవకాశం ఇచ్చిన టిడిపి అధినేత చంద్రబాబుకి ఎప్పటికీ రుణపడి ఉంటానని జీవీ ఆంజనేయులు అన్నారు. క్లిష్టమైన పరిస్థితులు నెలకొన్నప్పటికీ తన అభ్యర్థిత్వాన్ని ఖరారు చేయడం జీవితాంతం గుర్తుపెట్టుకుంటానన్నారు. ఆదివారం మంగళగిరిలోని టిడిపి కేంద్ర కార్యాలయంలో అభ్యర్థులకు బీ ఫారాలు అందజేయగా పల్నాడు జిల్లా వినుకొండ స్థానం నుండి ఆంజనేయులు అందుకున్నారు. వినుకొండ ప్రజల మద్దతుతో రికార్డు స్థాయి ఆధిక్యంతో విజయం సాధించి అధినేత నమ్మకాన్ని నిలబెట్టుకుంటానన్నారు.

ప్రజాశక్తి - సత్తెనపల్లి రూరల్

సత్తెనపల్లి నియోజకవర్గ టిడిపి జనసేన ఉమ్మడి అభ్యర్థి కన్నా లక్ష్మీనారాయణ టిడిపి జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబు నాయుడు నుండి పార్టీ బీ ఫామ్ అందుకున్నారు. ఈ నెల 22న కన్నా లక్ష్మీనారాయణ నామినేషన్ దాఖలు చేయనున్న నేపథ్యంలో ఉండవల్లి పార్టీ కేంద్ర కార్యాలయంలో చంద్రబాబు బీ ఫామ్‌ను ఆదివారం అందచేశారు. ఇదిలా ఉండగా మాచర్ల నియోజకవర్గం టిడిపి అభ్యర్థిగా జూలకంటి బ్రహ్మానందరెడ్డి, పెదకూరపాడు అభ్యర్థిగా భాష్యం ప్రవీణ్ బీ ఫారాలు అందుకున్నారు. ప్రవీణ్ ఈనెల 25న పెదకూరపాడు తహశీల్దార్ కార్యాలయంలో నామినేషన్ వేయనున్నారు.

ఘర్షణల్లో గాయపడిన కంభంపాడు వైసిపి నాయకుడు ఉడుముల లక్ష్మారెడ్డి, రాయవరానికి చెందిన పి.ఆంజనేయులు

## టిడిపి-వైసిపి ఘర్షణలు

### కంభంపాడు, రాయవరంలో పలువురికి గాయాలు

ప్రజాశక్తి - మాచర్ల

మాచర్ల మండలం కంభంపాడు, రాయవరం గ్రామాల్లో టిడిపి, వైసిపి గ్రూపుల మధ్య ఆదివారం రాత్రి ఘర్షణలు జరిగింది. ఖమ్మంపాడులో జరిగిన ఘర్షణలో వైసీపీకి చెందిన ఉడుముల లక్ష్మారెడ్డి, టిడిపికి చెందిన మరికొందరికి గాయాలయ్యాయి. లక్ష్మారెడ్డిని మాచర్ల ప్రభుత్వాసుపత్రిలో ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన చికిత్స కోసం నరసరావుపేట తరలించారు. రాయవరంలో చర్చి సమస్య వివాదంలో ఎస్సీల మధ్య జరిగిన ఘర్షణలో పేరుపోగు విజయకుమార్, పెనుపాటి ఆంజనేయులు మరికొంతమందికి గాయాలయ్యాయి. ఇద్దరిని నరసరావుపేట తరలించారు. మాచర్ల రూరల్ ఎస్సై రాజశేఖర్ కేసు దర్యాప్తు చేస్తున్నారు. ఎన్నికల వేళ ఘర్షణలపై స్థానికులు భయపడుతున్నారు.

జగనన్న కాలనీ పక్కనే తవ్వుతున్న క్వారీ

గతంలో తవ్విన క్వారీ గోతులు

# అధికార పార్టీ అండతో అడ్డగోలు తవ్వకాలు

- 20 ఏళ్ల తరువాత విజృంబిస్తున్న మట్టి మాఫియా
- నిబంధనలకు విరుద్ధంగా తవ్వకాలు
- తీవ్ర ఆందోళనలో స్థానికులు, రైతులు

ప్రజాశక్తి-తెనాలి

అక్రమార్కులు ధనార్జనకు మట్టి తవ్వకాలను అడ్డాగా ఎంచుకున్నారు. దానికి అధికార పార్టీనాయకులు, అధికారుల అండదండలు పుష్కలంగా లభించటంతో నిబంధనలను తుంగలోతొక్కారు. దాదాపు 20 ఏళ్ళ క్రితం నిలిపివేసిన క్వారీ తవ్వకాలను వైసిపి ప్రభుత్వంలో పున:ప్రారంభించారు. జగనన్న కాలనీ మెరకల కోసమంటూ బురిడీ కొట్టించి క్వారీ తవ్వకాలకు తెరతీశారు. కాలనీ మెరకలకు ఉపయోగపడేది పదిశాతమైతే, అడ్డగోలు విక్రయాలకు 90శాతం తరలించేస్తున్నారు. స్థానిక శాసనస కనుసన్నల్లో జరుగుతున్న అక్రమ క్వారీ తవ్వకాలకు సంబందించిన వివరాలిలా ఉన్నాయి.

గుంటూరు జిల్లా తెనాలి మండలం కొలకలూరు పంచాయతీ పరిధిలో దాదాపు 20 ఏళ్ళ క్రితం అడ్డగోలుగా క్వారీ తవ్వకాలు జరిగాయి. కొలకలూరు-అనుమర్లపూడి డొంకరోడ్డులో రోడ్డుకు ఇరువైపులా దాదాపు 100 ఎకరాలలో మట్టి కొల్లగొట్టారు. నిబంధనలకు విరుద్ధంగా తాడిచెట్టులోతున మట్టి తవ్వేసి అక్రమార్కులు సొమ్ము చేసుకున్నారు. అదే సమయంలో మట్టి పెళ్ళలు విరిగి పడి కొలకలూరు ఎస్సీ కాలనీకి చెందిన నలుగురు ఒకే రోజు మృత్యువాత పడటం సంచలనం రేకెత్తించింది. దీనికి తోడు పొలాల పక్కనే లోతుగా తవ్వేయటంతో పంట పొలాల్లో నీరు నిలిచేది కాదు. దీంతో దాదాపు 2004-05 కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో నిర్వహించిన ప్రజాపథం కార్యక్రమంలో క్వారీలను నిలుపు చేయాలని స్థానికులు అదికారులను కోరారు. దీంతో స్పందించిన అధికారులు, ప్రజాప్రతినిధులు క్వారీ తవ్వకాలను పరిశీలించి ముక్కున వేలేసుకున్నారు. మైనింగ్ అధికారులతో మాట్లాడి తక్షణమే క్వారీ తవ్వకాలను నిలిపివేయాలని, అలాగే భవిష్యత్‌లో కొలకలూరులో క్వారీ తవ్వవకాలకు అనుమతులివ్వ కూడదంటూ జెడ్పీలోనూ. పంచాయతీలోనూ తీర్మానించినట్లు అప్పట్లోనే అధికారులు స్పష్టం చేశారు. దీంతో క్వారీ తవ్వకాలు శాశ్వతంగా మూత పడ్డాయి. తదుపరి 2009లో తిరిగి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వంకాని, 2014లో అధికారంలోకి వచ్చిన టిడిపి కాని కొలకలూరులో క్వారీ తవ్వకాలకు సాహసించలేదు.

**అడ్డగోలు తవ్వకాలకు తెరతీసిన వైసిపి**

ఇదిలా ఉంటే 2019లో అధికారంలోకి వచ్చిన వైసిపి పేదల సంక్షేమం పేరిట దోపిడీకి తెరతీసింది. పేదలకు నివేశన స్థలాలు ఇచ్చేందుకు జరిపిన భూసేకరణలో అధికారులు, ప్రజాప్రతినిధులు కోట్లాది రూపాయల అవినీతికి పాల్పడ్డారన్న ఆరోపణలున్న సంగతి బహిరంగ రహస్యమే. నివేశన స్థలాలు లబ్దిదారులకు కేటాయించి, జగనన్న కాలనీగా వాటికి నామకరణం చేశారు. అంతటితో ఆగకుండా ఆ స్థలాలకు మెరకల పేరిట మట్టితవ్వకావలకు ఆజ్యం పోశారు. నిబంధనలను గాలికి వడిలేశారు. జగనన్న కాలనీకి ఆనుకునే మట్టి తవ్వకాలు చేపట్టారు. మైనింగ్ అనుమతులకు భిన్నంగా అడ్డగోలుగా తవ్వేస్తున్నారు. పంటపొలాలున్న నేపథ్యంలో నాలుగు మీటర్ల లోతుకు మించి తవ్వ కూడదు. నిబంధనలను ఉల్లంఘించి దాదాపు 12 మీటర్ల లోతు తవ్వేశారు. తవ్వకాలను అనుమతించిన మైనింగ్ అధికారులుగాని, రెవిన్యూ అధికారులు గాని అటువైెను కన్నెత్తి కూడా చూడలేదు. అధికార పార్టీపై స్వామిభకత్తో, మామూళ్ళ మత్తులో జోగుతున్నారో తెలియదుగాని అడ్డగోలు తవ్వకాలపై మాత్రం పెదవి విప్పటంలేదు. దీనిపై కొందరు గ్రామస్తులు నేరుగా ఎమ్మెల్యేకు పిర్యాదు చేశారు. ఎమ్మెల్యేను కలిసి విషయం వివరిస్తే ఆయన ఆగ్రహించినట్లు సమాచారం. జగనన్న కాలనీ మెరకలకు మట్టి ఎక్కడి నుంచి తేవాలో చెప్పండంటూ తిరిగి ప్రశ్నించారని, మట్టి తవ్వకాలు ఆపే ప్రసక్తే లేదని చెప్పినట్లు గ్రామస్తులు చెబుతున్నారు.

ఇటీవలే పరిమితికి మించిన లోతు తవ్వేసిన క్వారీ

అడ్డగోలు మట్టి తవ్వకాలకు ఎమ్మెల్యే అండదండలు పుష్కలంగా ఉండటంతో ఆక్రమార్కులు రెచ్చిపోతున్నారు. జగనన్న కాలనీకి కనీసం 10శాతం మట్టికూడా ఉపయోగించటంలేదు. కాలనీపేరిట అంతా అక్రమంగా విక్రయించేస్తున్నారు. ఈ ప్రాంతంలో అంతా దాదాపుగా ఎస్సీల భూములే ఉన్నాయి. గతంలో క్వారీలతో వ్యవసాయం చేయలేక కొంత మంది మట్టి మాఫియాకు విక్రయించారు. సుదీర్ఘ విరామం తరువాత మట్టి మాఫియా క్వారీ తవ్వకాలను సాగిస్తుండటంతో ఉన్న కొద్దిపాటి భూములను విక్రయించాలన్నా బాధే. అలాగని వ్యవసాయం చేయాలన్నా బాధేనని స్థానికులు వాపోతున్నారు. నివేశన స్థలాలు కేటాయించి, వాటికి ఆనుకేనే పెద్దఎత్తున జరుగుతున్న క్వారీ తవ్వకాలపై ప్రజలు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గతంలో క్వారి గుంతల్లో పశువులు, చిన్నారులు మృత్యువాత పడిన సందర్భాలు లేకపోలేదు. అప్పట్లో తవ్విన పెద్దపెద్ద గోతులు ఇప్పటికీ అలానే ఉన్నాయి. ఇప్పటికైనా అదికారులు స్పందించి అక్రమ క్వారీ తవ్వకాలను నిలుపుచేయాలని కోరుతున్నారు.

# ఉద్యోగం వదిలి ఉద్యమ బాటలోకి

(మొదటి పేజీ తరువాయి)

మార్పు తేవడానికి నడుం బిగించాలని అనుకున్నానని తెలిపారు. గ్రామంలో అభ్యుదయ భావాలున్న యువకుల్ని కూడగట్టి యువజన సంఘంలో పనిచేస్తూ 1981లో జరిగిన సర్పంచ్ ఎన్నికల్లో విజయం సాధించానని, సర్పంచ్‌గా ఉన్న సమయంలో దళితవాడల్లో స్కూల్ భవనం నిర్మించామని తెలిపారు. రజకులకు దోబీఖానాలు నిర్మించామన్నారు. వీధివీధినా విద్యుత్ స్తంభాలు వేయించి విద్యుత్ కాంతులు తెచ్చామన్నారు. గ్రామంలో మట్టి రోడ్లను సిమెంట్ రోడ్లుగా తీర్చిదిద్దామని, ఆ విధంగా 20 ఏళ్లు (2001 వరకు) సర్పంచ్‌గా పనిచేశానని తెలిపారు.

కొండవీటి వాగు ముంపుతో పంటలు కోల్పోయి నష్టపోతున్న రైతులు కోసం యువకుల శ్రమదానంతో వాగు పూడిక తీయించి పంట పొలాలకు వెళ్లే రైతుల కోసం వంతెన నిర్మించామన్నారు. గుంటూరు ఛానల్ పేరుకుపోయిన తూటికాడ తొలగించాలని ఆందోళన చేసి తొలగింజేశామన్నారు. తాడేపల్లి మండలంలో ప్రభుత్వ భూముల్లో ఇళ్లేసుకుని నివాసముంటున్న పేదలకు ఇళ్ల పట్టాల కోసం దశలవారీగా ఆందోళనలు చేశామని, రాజధాని ప్రాంతంలో భూసేకరణ చట్టం ప్రకారం అమరావతి రాజధానికి భూములు సేకరించాలని ఉద్యమించామని గుర్తు చేశారు. మంగళగిరి నియోజకవర్గంలో వివిధ రకాల ప్రభుత్వ భూముల్లో దీర్ఘకాలంగా నివాసం ఉంటున్న పేదల ఇళ్ల పట్టాల కోసం పోరాడుతున్నామన్నారు. పెదవడ్లపూడి హై లెవెల్ ఛానల్ నిర్మాణం పూర్తి చేసి 25 వేల ఎకరాలకు సాగునీరు సాధన కోసం ఉద్యమించామన్నారు. అమరావతిని ఏకైక రాజధానిగా ఉండాలని ఆందోళన చేశాన్నారు. నియోజకవర్గంలో అస్తవ్యస్తంగా ఉన్న డ్రెయినేజీ వ్యవస్థ, రోడ్ల నిర్మాణం చేయాల్సిన అవసరం ఉందనిన్నారు. నియోజవర్గంలో పేదలు ఎదుర్కొంటున్న అనేక సమస్యలను గుర్తించి వాటి పరిష్కారానికి ఉద్యమిస్తున్నామని చెప్పారు. మంగళగిరి - తాడేపల్లి నగరపాలక సంస్థ ఏర్పడిన తర్వాత ఆస్తి పన్ను భారీగా పెంచారని, ఈ పన్నులు తగ్గించాలని, చెత్తపన్నును రద్దు చేయాలని అన్నారు. వీటన్నింటిపైనా ఇప్పటికే సిపిఎం, ప్రజా సంఘాలుగా అనేక ఆందోళనలు, ఉద్యమాలు బహుముఖ రూపాల్లో చేశామని చెప్పారు. ప్రజాపోరాటాల క్రమంలో అనేక నిర్బంధాలకూ గురయ్యామని, ఆరు నెలల పాటు రహస్య జీవితం, మూడు నెలల జైలు జీవితం గడిపానని తెలిపారు. శాసన సభకు ఎన్నికవడం ద్వారా చట్టసభల్లోనూ పేదల పక్షాన పోరాడడానికి, సమస్యలను పరిష్కరించడానికి ఇండియా వేదిక బలపరిచన అభ్యర్థిగా ఎన్నికల్లో పోటీ చేస్తున్నానని చెప్పారు.

# బిజెపి ప్రమాదాన్ని గుర్తించకపోతే ప్రాంతీయ పార్టీలన్నీ కనుమరుగే

### ఈదా ఎర్ర సాంబిరెడ్డి వర్ధంతి సభలో నాయకుల నివాళి

ఈదా ఎర్ర సాంబిరెడ్డి వర్ధంతి సభలో మాట్లాడుతున్న పాశం రామారావు

**ప్రజాశక్తి - మంగళగిరి రూరల్**

బిజెపి ప్రమాదాన్ని గుర్తించకపోతే ప్రాంతీయ పార్టీలన్నీ కనుమరుగయ్యే ప్రమాదం లేకపోలేదని రాష్ట్రంలోని పాలక ప్రతిపక్షాలు ఈ ప్రమాదాన్ని గుర్తించ కుండా వంత పాడుతున్నాయని ఇది రాబోయే కాలంలో పెద్ద సవాలేనని ఈ క్రమంలో కేంద్రంలోని బిజెపిని వ్యతిరేకించాలని సిపిఎం నాయకులు పిలుపునిచ్చారు. మండలంలోని కాజా గ్రామంలో సిపిఎం ఈదా ఎర్ర సాంబిరెడ్డి 12వ వర్ధంతి సభ ను మాజీ ఎంపిటీసీ సభ్యులు ఈదా ప్రతాపరెడ్డి అధ్యక్షతన నిర్వహించారు. గ్రామంలో పార్టీ నిర్మాణానికి విశేష కృషి చేశారని, పేదల అభ్యున్నతికి ఎర్ర సాంబిరెడ్డి నిరంతరం పాటు పడ్డారని సిపిఎం జిల్లా కార్యదర్శి పాశం రామారావు పేర్కొన్నారు. ఎర్ర సాంబి రెడ్డి స్ఫూర్తితో రాబోయే ఎన్నికలలో ఇండియా వేదిక అభ్యర్థుల గెలుపు కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు. నేడు కేంద్రం లోని బిజెపి ఈడి నీ అడ్డం పెట్టుకొని వారికి వ్యతిరేకంగా ఉన్నటువంటి వారందరినీ అరెస్ట్‌లు చేయడం జరుగుతుందన్నారు. బిజెపినీ ఎవరు వ్యతిరేకిస్తుంటే వారిని, ముఖ్య మంత్రులు ను సైతం అరెస్ట్ చేసి జైళ్ల లో పెడుతున్నారనీ ప్రజాస్వామ్యంలో ఇది తగునా అని ప్రశ్నించారు. ఎన్నికల బాండ్ల కొనుగోలు కుంభ కోణం భారత దేశంలో అతి పెద్దదనీ , మరి అతి ఎక్కువ బాండ్ల కలిగిన బిజెపి నేతలను ఎందుకు జైళ్లలో పెట్టడం లేదని ప్రశ్నించారు. రాష్ట్రాన్ని నాశనం చేసింది మొట్ట మొదటిది బిజెపి, అటువంటి పార్టీకి రాష్ట్ర పార్టీలు మద్దతు ఎందుకు అని ప్రశ్నించారు. మత ఘర్షణలకు పాల్పడుతున్న బిజెపి సిఎఎ నీ రుద్దాలనీ చూస్తుందన్నారు. దేశం నష్ట పోతుంటే ప్రాంతీయ పార్టీలకు పట్టక పోవడం సిగ్గు చేటన్నారు. గ్రామంలో పార్టీ నిర్మాణానికి, తద్వారా పార్టీ అభ్యర్థుల గెలుపు కోసం కృషి చేయాలని కోరారు. 22న జరిగే జొన్న శివశంకర్ నామినేషన్ కార్యక్రమాన్ని జయప్రదం చేయా లని కోరారు. సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఈమని అప్పారావు మాట్లాడుతూ కార్మికుల, రైతుల, అంగన్వాడి, పంచాయతీ కార్మికుల సమస్యల పై పోరాటాలు నిర్వహించి చరిత్ర సిపిఎందేనని చెప్పారు. 23న కాజా గ్రామంలో సిపిఎం అభ్యర్థి గెలుపునకు జరిగే ప్రత్యేక క్యాంపెయిన్ నిర్వహణలో ప్రతి ఒక్కరు భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. తొలుత ఎర్ర సాంబిరెడ్డి చిత్ర పటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఎర్రసాంబిరెడ్డి భార్య ఈదా లక్ష్మి కాంతమ్మ, సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు బి. కోటేశ్వరి, ఉమా మహేశ్వర రెడ్డి, సింహాద్రి విజయలక్ష్మి, తమ్మా ప్రసాద రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## గడ్డపారలతో పగలగొట్టి ఇంట్లో చోరీ

**ప్రజాశక్తి - రెంటచింతల**

మండల కేంద్రమైన రెంటచింతలలోని లూర్దు మాత చర్చి సమీపంలో ఒక గృహంలో దొంగలు చొరబడి గడ్డపారులతో తలుపులు బీరువాను పగలగొట్టి నగదు, వెండిని దోచుకున్న సంఘటన జరిగింది. బాధితులు తెలిపిన వివరాల ప్రకారం గుండా రమేష్ సత్యవతి ఈనెల 18 రాత్రి తిరుమల వెళ్లారు వివిధ పుణ్యక్షేత్రాలు సందర్శించి 21న ఆదివారం ఉదయం ఇంటికి వచ్చేసరికి ఇంటి తలుపులు, బీరువా పగలగొట్టి ఉండటంతో బీరువాలోనే సుమారు రూ.85 వేలు నగదు, 545 గ్రాముల వెండి అపహరణకు గురైనట్లు తెలిపారు. రెంటచింత లలో వరుసగా ఇళ్లల్లో దొంగతనాలు జరిగిన వాటిపై ఎలాంటి పురోగతి లేదని, ఇళ్లకు తాళాలు వేసి ఊళ్లకు వెళ్లాలంటే భయంగా ఉందని గ్రామస్తులు తెలిపారు.

## గల్లంతైన విద్యార్థుల మృతదేహాలు లభ్యం

**ప్రజాశక్తి - దుర్గి**

మండల పరిధిలోని అడిగొప్పల్లో శనివారం సాయంత్రం గల్లంతైన విద్యార్థుల మతదేహాలు ఆదివారం అడిగోప్పల సమీపంలోని బ్రిడ్జికి 20 మీటర్ల దూరంలో ఓ విద్యార్థి మా కారంపూడి మండలం వైకుంఠపురం సమీపంలో మరో విద్యార్థి మగదేహాలు లభ్యమయ్యాయని ఎస్సై కోటయ్య తెలిపారు పుట్టినరోజు వేడుకల రోజున సాహెబ్ బ్ అతని స్నేహితుడు యూసఫ్ లు శనివారం సాగర్ కుడి కాలువ లో అడిగొప్పల సమీపంలో సెల్ఫీలు దిగే ప్రయత్నంలో కాలుజారి కొట్టుకుపోవడంతో ఈ సంఘటన జరిగింది తల్లి మస్తాన్ బి ఫిర్యాదు మేరకు ఎస్సై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు విద్యార్థుల మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం మాచర్ల ప్రభుత్వ వైద్యశాలకు తరలించినట్లు ఎస్సై కోటయ్య చెప్పారు.

## అనారోగ్య ఆహార అలవాట్లతో గుండె సమస్యలు

**ప్రజాశక్తి-గుంటూరు**

మాట్లాడుతున్న డాక్టర్ విజయలక్ష్మి

స్థానిక అరండల్‌పేటలోని అవగాహన కార్యాలయంలో గుండె సంబంధిత వ్యాధులు, వాటి పరిష్కారాల గురించి నిర్వహించిన ఆరోగ్య సభలో కార్డియాలజిస్ట్ డాక్టర్ నూతక్కి విజయలక్ష్మి ప్రధాన వక్తగా పాల్గొని ప్రసంగించారు. గతంలో పెద్ద వయసు వారికి మాత్రమే ఈ హదయ సంబంధిత వ్యాధులు ఎక్కువగా చూసేవారమని, కానీ ఇప్పుడు యువతలో కూడా ఈ హదయ సంబంధిత వ్యాధులు చూస్తున్నామని, దీనికి కారణం ముఖ్యంగా అనారోగ్యపు ఆహారపు అలవాట్లు, మానసిక ఒత్తిడి, వ్యాయామం లేని జీవితం అన్నారు. కావున అందరూ ఆరోగ్యకరమైన ఆహారం తీసుకుంటూ, మానసిక ఒత్తిడిని తగ్గించే దిశగా జీవనం కొనసాగిస్తూ, కనీసం రోజుకు ఒక అరగంట వ్యాయామం ఉండే విధంగా చూసుకుంటే చాలావరకు అనారోగ్య సమస్యలు దరిచేరవని అంతేకాకుండా చెడువ్యసనాలకు దూరంగా ఉంటూ, మంచి ఆహ్లాదకరమైన వాతావరణంలో మన చుట్టూ ఉండే విధంగా చూసుకుంటూ, మంచి ఆలోచనలను చేస్తూ, మంచి మార్గంలో పయనిస్తూ ఒత్తిడికి గురికాకుండా ఉంటే చాలా అనారోగ్య సమస్యలు దరి చేరవని తెలిపారు. ముఖ్యంగా ఈగుండె జబ్బులకి గురికాకుండా ఉండాలి అంటే బిపి, మధుమేహం, థైరాయిడ్ లాంటి వాటిని అదుపులో ఉంచుకుంటూ, రక్తంలో కొలెస్ట్రాల్ శాతాన్ని అదుపులో ఉంచుకోవాలని సూచించారు. రక్తపోటు వల్ల కళ్ళకు, గుండెకు, మూత్రపిండాలకు, మెదడుకు సంబంధించిన సమస్యలు తలెత్తుతాయని, ఈ రక్తపోటును అదుపులో ఉంచుకోవాలంటే ముఖ్యంగా బరువును తగ్గించుకోవడం, తాజా పండ్లను తక్కువ కొవ్వు శాతం కలిగిన పాల ఉత్పత్తులను తీసుకోవడం, ఆహారంలో ఉప్పును తగ్గించి తీసుకోవడం, ఎల్లప్పుడూ చురుకుగా ఉండటానికి ప్రయత్నం చేయటం, ఆల్కహాల్ తీసుకునేవారు తగ్గించటం చేస్తే మంచిదని తెలిపారు. ఆయాసం కళ్ళు తిరగడం, నీరసం, చాతిలో బరువుగా ఉండటం, ఛాతి నొప్పిగా ఉండటం ఇవన్నీ హార్ట్ఎటాక్ లక్షణాలని, ఎప్పుడైనా ఈ లక్షణాలు గుర్తిస్తే వెంటనే దగ్గరలో ఉన్న డాక్టర్లు సంప్రదించి ఈసీజీ తీయించుకోవటం ఉత్తమమని తెలిపారు. గుండె జబ్బు ఉన్నవారు కోడిగుడ్డు తెల్ల సొన మాత్రమే తీసుకోవాలని, మాంసాహారం మానేయాలని మటన్ లాంటివి అసలు తీసుకోరాదని వాటి వలన రక్తంలో కొలెస్ట్రాల్ లెవెల్స్ పెరిగి గుండె జబ్బుకి దారితీస్తాయని తెలిపారు. అనంతరం డాక్టర్ విజయలక్ష్మి, ఎయిమ్స్ హాస్పిటల్ వైద్యులు డాక్టర్ రాజేంద్రప్రసాద్‌ను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమానికి టీవీ సాయిరాం కోఆర్డినేటర్‌గా వ్యవహరించగా, సభ్యులు కే.చంద్రశేఖరరావు, ఆర్.ఆర్. ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో అగ్నిప్రమాదం

### ఒకే కుటుంబానికి చెందిన రెండు పూరిళ్లు దగ్ధం

### రూ 5 లక్షల ఆస్తి నష్టం - బాధితులకు ఎమ్మెల్యే పరామర్శ

**ప్రజాశక్తి-పల్నాడు జిల్లా**

విద్యుత్‌షార్ట్ సర్క్యూట్‌తో అగ్ని ప్రమాదం చోటు చేసుకుని ఒకే కుటుంబానికి చెందిన రెండు పూరిళ్లు దగ్ధమైన ఘటన రొంపిచర్ల మండలం అన్నవరం గ్రామంలో ఆదివారం చోటు చేసుకుంది. ఆ గ్రామంలో ఎస్‌సి కాలనీలో నివాసముంటున్న పోలెపోగు పిచ్చయ్య, అతని కుమారుడు జాన్‌లకు చెందిన రెండు పూరిళ్ళు విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో పూర్తిగా దగ్ధమయ్యాయి. ఆ సమయంలో రెండు పూరిళ్ళల్లో ఉన్న గ్యాస్ సిలిండర్లకు మంటలు అలుముకుని పేలటం వలన పెద్ద ఎత్తున మంటలు ఎగిసిపడ్డాయి. దీంతో కాలనీవాసులు భయాందోళనకు గురై పరుగులు తీశారు. మంటలు ఆర్పటానికి ఎవరూ సాహసించలేదు. సంఘటన జరిగిన సమయంలో ఇళ్ళల్లో ఎవరూ లేకపోవటంతో ఎటువంటి ప్రాణ నష్టం జరగలేదు. అనంతరం సమాచారము తెలుసుకున్న నరసరావుపేట అగ్ని మాపక సిబ్బంది సంఘటన స్థలానికి చేరుకుని మంటలను పూర్తిగా అదుపు చేశారు. బాధితులు కట్టుబట్టలతో మిగిలారు. ఈ ప్రమాదంలో రెండు పూరిళ్ళల్లో రూ 1.50 లక్షల నగదు, 5 సవర్ల బంగారు ఆభరణాలు,8 మిర్చి బస్తాలు, విలువైన వస్తువులు, సామాన్లు, దుస్తులు అగ్నికి ఆహుతి అయ్యాయి. సమాచారం తెలుసుకున్న వైసిపి ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. బాధిత కుటుంబ సభ్యులకు అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు పచ్చవ రవీంద్ర బాబు, ఎంపిటిసి రాపూరి కుమార్ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ఆత్మీయ సమావేశంలో నాదెండ్ల, ఆలపాటి, పెమ్మసాని సతీమణి తదితరులు

## బ్రేక్‌ఫాస్ట్ విత్ నాదెండ్ల, పెమ్మసాని

**ప్రజాశక్తి తెనాలి**

వ్యాపారులను బెదిరించి వారి లావాదేవీలలో జోక్యం చేసుకొని వాటాలు బలవంతంగా లాక్కునే పరిస్థితులు రాష్ట్రంలో నెలకొన్నాయని, వైసిపి ఐదేళ్ల దుర్మార్గపు పాలనకు ఇదే నిదర్శనమని ఎన్డీఏ కూటమి తెనాలి అభ్యర్థి నాదెండ్ల మనోహర్ అన్నారు. స్థానిక రైల్వే స్టేషన్ రోడ్డులోని గౌతమ్ గ్రాండ్ హోటల్లో ఆదివారం బ్రేక్ ఫాస్ట్ విత్ నాదెండ్ల అండ్ పెమ్మసాని ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మనోహర్ మాట్లాడుతూ ట్రేడ్ క్యాపిటల్‌గా విలసిల్లుతున్న తెనాలి ప్రశాంతమైన వాతావరణానికి చిరునామా అని చెప్పారు. అయితే ఐదేళ్ల వైసిపి పాలనలో వ్యాపారులు బెంబేలెత్తిపోయారని ఈ పరిస్థితులకు చరమగీతం పాడాలంటే కూటమిని గెలిపించాలన్నారు. మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ ప్రశ్నించే గొంతుకను సైతం నొక్కేసే తరుణంలో మార్పు అనివార్యమని దానిని ప్రజలు గమనించి కూటమిని బలపరచాలన్నారు. సమావేశంలో డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ సతీమణి డాక్టర్ శ్రీరత్న, కూటమి పార్టీల నాయకులు పెండ్యాల వెంకటరావు, పాటిబండ్ల రామకృష్ణ, అన్నం పిన్నారావు, అమ్మిశెట్టి హరికష్ణ, షేక్ కాలేషా పాల్గొన్నారు.

## 6వ వార్డులో వైసిపి ప్రచారం

**ప్రజాశక్తి-తాడేపల్లి**

తాడేపల్లి పట్టణంలోని ఆరో వార్డు సచివాలయ పరిధిలో ఆదివారం వైసిపి నాయకులు ఎన్నికల ప్రచారం నిర్వహించారు. వైసిపి ఎం అభ్యర్థి కిలారి వెంకట రోశయ్య, మంగళగిరి ఎమ్మెల్యే అభ్యర్థి మురుగుడు లావణ్య విజయాన్ని కాంక్షిస్తూ వైసిపి తాడేపల్లి పట్టణ అధ్యక్షులు బుర్రముక్కు వేణుగోపాలస్వామిరెడ్డి ఆధ్వర్యంలో ఇంటింటికీ తిరుగుతూ ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బూత్ కన్వీనర్ ఉప్పు శీను, వేముల కోటేశ్వరరావు, మాజీ కౌన్సిలర్ వేముల లక్ష్మీ రోజా, ఎస్సీ సెల్ అధ్యక్షులు ముదిగొండ ప్రకాష్, కూరగంటి ఉదయరాజు, బత్తుల వెంకటేశ్వరావు, గుంజ అంబారావు పాల్గొన్నారు.

## అన్ని స్థానాల్లో పోటీ చేస్తున్నాం

### ఆంధ్ర రాష్ట్ర సమితి వ్యవస్థాపక అధ్యక్షులు జంజనం కోటేశ్వరరావు

**ప్రజాశక్తి మంగళగిరి**

విలేకరులతో మాట్లాడుతున్న జంజనం కోటేశ్వరావు

రాష్ట్ర వ్యాప్తంగా ఆంధ్ర రాష్ట్ర సమితి అభ్యర్థులను నామినేషన్లు వేయకుండా ప్రధాన పార్టీల నాయకులు అడుకుంటున్నారని, ఎవరు ఎన్ని బెదిరించినా అన్ని స్థానాల్లో పోటీ చేస్తామని ఆంధ్ర రాష్ట్ర సమితి వ్యవస్థాపక అధ్యక్షులు, మంగళగిరి అసెంబ్లీ నియోజకవర్గం అభ్యర్థి జంజనం కోటేశ్వరావు ఆదివారం సాయంత్రం ఆంధ్ర రాష్ట్ర సమితి కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ఉన్నారు. పేదవాడి గుండె చప్పుడు ఆంధ్ర రాష్ట్ర సమితి ప్రధాన ఎజెండాగా ఎన్నికల్లో పోటీ చేస్తున్నామని అన్నారు. ఎస్సీ ఎస్టీ బీసీ మైనార్టీలను తపాల వారీగా ముఖ్యమంత్రి చేయడమే తమ ధ్యేయమని అన్నారు. గుంటూరు మంగళగిరి తాడేపల్లి విజయవాడ లను గ్రేటర్ అమరావతిగా చేస్తానని తెలిపారు. వాలంటరీ వ్యవస్థను పర్మినెంట్ చేస్తానని చెప్పారు. ప్రజలందరికీ ఉచిత వైద్య సేవలను అందిస్తామని చెప్పారు. రాష్ట్రవ్యాప్తంగా అన్ని నియోజకవర్గాల్లో ప్రచారాన్ని ముమ్మరం చేశామని తెలిపారు. కొన్ని నియోజకవర్గాల్లో తమ పార్టీ అభ్యర్థులను ఇబ్బందులు పెడుతున్నారని విమర్శించారు.

## చెక్‌పోస్ట్ వద్ద జిల్లా ఎన్నికలాధికారి తనిఖీ

ప్రజాశక్తి - విజయపురిసౌత్

మాచర్ల నియోజకవర్గం సిరిగిరిపాడు వద్ద చెక్‌పోస్ట్‌ను పల్నాడు జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ ఎల్.శివశంకర్ ఆదివారం సాయంత్రం తనిఖీ చేశారు. తనిఖీలను పకడ్బందీగా నిర్వహించాలని, అలసత్వం వహించవద్దని సిబ్బందికి సూచించారు. నిరంతర నిఘా అవసరమన్నారు. అక్రమ మద్యం, నగదు, ఇతర వస్తువులపై సరైన నిఘా ఉంచాలన్నారు. కార్యక్రమంలో మాచర్ల నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి శ్యాంప్రసాద్ పాల్గొన్నారు.

## సి విజిల్ యాప్ ద్వారా ఫిర్యాదు చేయండి

ప్రజాశక్తి - రెంటచింతల

ఎన్నికల ప్రవర్తన నియమావళిని ఎవరైనా ఉల్లంఘిస్తే ఎన్నికల కమిషన్ ప్రత్యేకంగా రూపొందించిన సి విజిల్ యాప్ ద్వారా ఓటర్లు ఫిర్యాదు చేయాలని పల్నాడు జిల్లా జాయింట్ కలెక్టర్, మాచర్ల నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి శ్యాంప్రసాద్ తెలిపారు. టైల్ పాండ్ ప్రాజెక్ట్ అతిథి గృహం వద్ద ఆదివారం ఆయన విలేకర్లతో మాట్లాడారు. ఎన్నికల నిర్వహణపై ఏమైనా సందేహాలుంటే కమాండ్ కంట్రోల్ రూమ్ హెల్ప్‌డెస్క్‌ను సంప్రదించాలని సూచించారు. జిల్లా కలెక్టర్ కార్యాలయంలో హెల్ప్‌డెస్క్ ఏర్పాటు చేశామన్నారు. ఎన్నికల సమయంలో డబ్బులు, బహుమతులు, మద్యం పంపిణీ, అనుమతి లేకుండా ప్రైవేట్ ఆస్తులపై పోస్టర్ల ప్రచారం, ఓటర్లకు బెదిరింపులు, రాత్రి 10 గంటల తర్వాత ప్రచారం తదితర వాటిపై సి విజిల్ యాప్ ద్వారా ఫిర్యాదు చేయవచ్చన్నారు ఈ ఫిర్యాదులను వంద నిమిషాల్లో పరిష్కరించి చర్యలు తీసుకుంటామని చెప్పారు.

## ఆరో రోజుకు మంజిగ పంపిణీ

**ప్రజాశక్తి-సత్తెనపల్లి :** పట్టణంలోని పాతబస్టాండ్ సెంటర్లో పుచ్చలపల్లి సుందరయ్య విజ్ఞాన కేంద్రం (పిఎస్‌వికె) ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న మజ్జిగ చలివేంద్రం 6వ రోజుకు చేరింది. ఈ కార్యక్రమానికి అవసరమైన ఆర్థిక సాయాన్ని రొంపిచర్ల జ్ఞాన ప్రసూన జ్ఞాపకార్థం ఆమె భర్త, సిఐటియు నాయకులు ఆర్.పురుషోత్తం అందించారు. కార్యక్రమంలో నిర్వాహకులు పిఎస్‌వికె కన్వీనర్ పి.సూర్యప్రకాశరావు, ఎ.వెంకట్ నారాయణ, గద్దె చలమయ్య, పిన్నమనేని పాములయ్య, పి.వీరేశం, జి.ఉమశ్రీ, టి.రాము, కె.నాగేశ్వరరావు, షేక్ మస్తాన్‌వలి పాల్గొన్నారు.

## మోడల్ స్కూల్‌లో ప్రవేశాలకు పరీక్ష

**ప్రజాశక్తి-ఈపూరు :** స్థానిక ఏపీ మోడల్ స్కూల్‌లో 2023-24 సంవత్సరానికి సంబంధించి 6వ తరగతిలో ప్రవేశానికి ఆదివారం పరీక్షలు నిర్వహించినట్లు ప్రిన్సిపాల్ సునీల్ తెలిపారు. పరీక్షలు రాసేందుకు 129 మంది ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోగా పరీక్షకు 124 మంది హాజరయ్యారన్నారు. ఆరో తరగతిలో ప్రవేశానికి 100 సీట్లు ఖాళీలు ఉన్నాయని, ఫలితాల ఆధారంగా మెరిట్, రిజర్వేషన్ల ప్రాతిపదికను సీట్లను భర్తీ చేస్తామని చెప్పారు.

రొంపిచర్ల మండలం వి.రెడ్డిపాలెం ఎపి మోడల్ స్కూల్‌లో 6వ తరగతి ప్రవేశపరీక్ష ఆదివారం జరిగింది. 2024-25 విద్యా సంవత్సరానికి 100 సీట్లకు 265 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకోగా 246 మంది పరీక్షకు హాజరయ్యారని ప్రిన్సిపాల్ డాక్టర్ బి.రవినాయక్ అన్నారు.

# 5, 6, 7 తేదీల్లో పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

పోస్టల్ బ్యాలెట్‌కు సంబంధించి ఎన్నికల కమిషన్ రూపొందించిన నిబంధనలను తూచా తప్పకుండా పాటించాలని రిటర్నింగ్ అధికారులను పల్నాడు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ఎల్.శివశంకర్ ఆదేశించారు. పోస్టల్ బ్యాలెట్, హోం ఓటింగ్ తదితర అంశాలపై రిటర్నింగ్ అధికారులతో పల్నాడు జిల్లా కేంద్రమైన నరసరావుపేటలోని కలెక్టరేట్‌లో ఆదివారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడారు. ఎన్నికల విధుల్లో ఉన్న ఉద్యోగులకు పోస్టల్ బ్యాలెట్, ఇతర జిల్లాలలో ఓటు హక్కు కలిగి ఉండి ఎన్నికలు విధులు నిర్వహిస్తున్న వారికి పోస్టల్ బ్యాలెట్ ఏ విధంగా చేపట్టాలని వివరించారు. పల్నాడు జిల్లాలో ఓటు హక్కు కలిగి ఉండి ఎన్నికలు విధుల్లో పాల్గొనే వారికి చివరి తేదీ వరకు పోస్టల్ బ్యాలెట్ వినియోగించుకునేలా అనుమతిస్తామన్నారు. వచ్చే నెల 5, 6, 7వ తేదీల్లోగా పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు హక్కు కల్పిస్తామన్నారు. 5న పోలింగ్ అధికారులు, అసిస్టెంట్ పోలింగ్ అధికారులు, మైక్రో అబ్జర్వర్లకు, 6న పోలీసు సిబ్బందికి, 7న ముఖ్యమైన శాఖల సిబ్బందికి పోస్టల్ బ్యాలెట్ ఉంటుందని వివరించారు. ఇతర జిల్లాల్లో ఓటు హక్కు కలిగిన వారికి అమరావతి సచివాలయంలో మూడు ఎక్స్ఛేంజ్‌లను ఏర్పాటు చేశారన్నారు. జిల్లా వెలుపల ఓటర్లుగా ఉన్న ఉద్యోగులకు సంబంధించి ఫారమ్-12 మార్పిడి ప్రక్రియను సులభతరం చేయడానికి, మొదటి సెంట్రల్ ఎక్స్ఛేంజ్ ఈనెల 28న వెలగపూడిలోని రాష్ట్ర సచివాలయంలో ఉదయం 10 నుండి సాయంత్రం 5 గంటల వరకు ఉంటుందన్నారు. ఫారం-12 మార్పిడి ఇతర జిల్లాలతో జరుగుతుందన్నారు. ఈ మార్పిడిని సులభతరం చేయడానికి ఈనెల 26 లోపు ఎన్నికల విధుల్లో ఉన్న ఉద్యోగులు, ఇతర అర్హత కలిగిన సిబ్బంది నుండి ఫారమ్-12 సేకరించుకుని ఉండాలని చెప్పారు. డిఈఓలు ఇతర జిల్లాల నుండి ఫారం-12ను స్వీకరించి సంబంధిత ఆర్ఓలు ఏసీలకు ఫార్వార్డ్ చేస్తారన్నారు. అవసరమైన పోస్టల్ బ్యాలెట్ పత్రాలను ఆర్ఓ - ఏసి ఎన్నికల విధుల్లో ఉన్న ఓటర్ల జాబితాను పోస్టల్ బ్యాలెట్ ఓటు జారీ చేస్తుందన్నారు. ప్రతి కేటగిరీ (పోలింగ్ సిబ్బంది, పోలీసులు మొదలైనవి) ప్రత్యేక జాబితాను తయారు చేయాలన్నారు. ఈ నెల చివరి నాటికి 3 పోస్టల్ బ్యాలెట్‌లపై ఈసిఐ సర్క్యులర్ 'అనుబంధం-4'లో పేర్కొన్న ఫార్మాట్‌లో జాబితా

తయారు చేయబడుతుందని చెప్పారు. ఆర్ఒ-ఏసీ పోస్టల్ బ్యాలెట్ పేపర్‌తో పాటు 'అనుబంధం-4' కాపీని జిల్లా ఎన్నికల అధికారి ద్వారా సెంట్రల్ ఎక్స్ఛేంజ్ మెకానిజం ద్వారా మళ్లీ పని చేసే జిల్లాకు పంపుతుందన్నారు. బ్యాలెట్ పత్రాలు, 'అనుబంధం-4'ను జిల్లాల పోస్టల్ బ్యాలెట్ నోడల్ అధికారులు సరైన రసీదుతో మార్పిడి చేస్తారని చెప్పారు. ఇతర జిల్లాల పోస్టల్ బ్యాలెట్ పత్రాలను స్వీకరించిన తర్వాత, వర్కింగ్ డిస్ట్రిక్ట్ యొక్క ఎన్నికల అధికారి ఎన్నికల విధుల్లో ఉన్న ఉద్యోగి/అర్హత ఉన్న వ్యక్తులు ఫెసిలిటేషన్ సెంటర్ ద్వారా మాత్రమే ఓటింగ్‌ను సులభతరం చేయడానికి ఏర్పాట్లు చేస్తారన్నారు. ఫెసిలిటేషన్ సెంటర్‌లో పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్ ప్రక్రియ వచ్చేనెల 8వ తేదీలోగా ముగియాలన్నారు. పోస్టల్ బ్యాలెట్ నమోదు చేయడంలో విఫలమైన వారు 8 మే 2023 తర్వాత తమ ఓటు వేయలేరన్నారు. అర్హత కలిగిన హోమ్ ఓటర్ జాబితాను సిద్ధం చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ట్రైనీ కలెక్టర్ కల్పశ్రీ, జిల్లా రెవెన్యూ అధికారి వినాయకం, వివిధ శాఖల సిబ్బంది పాల్గొన్నారు.

# కాంగ్రెస్ అభ్యర్థుల విజయం కోసం ప్రచారం

ప్రజాశక్తి-పిడుగురాళ్ల

బిజెపిని, దానితో జతకట్టిన టిడిపి, జనసేన పార్టీలను, తొత్తుగా వ్యవహరిస్తున్న వైసిపిని ఓడించాలని, ఇండియా వేదిక అభ్యర్థులను గెలిపించాలని కోరుతూ కాంగ్రెస్, సిపిఎం శ్రేణులు ప్రచారం చేపట్టాయి. గురజాల నియోజకవర్గ కాంగ్రెస్ అభ్యర్థిగా తియ్యగూర యలమందరెడ్డిని, నరసరావుపేట పార్లమెంట్ కాంగ్రెస్ అభ్యర్థిగా అలెగ్జాండర్ సుధాకర్‌ను గెలిపించాని కోరుతూ ఆదివారం మాచవరం మండలంలో రేగులగడ్డ, వెల్లంపల్లి, చెన్నపాలెం, వేమవరం, తురకపాలెం, జింకలపాలెం తదితర గ్రామాల్లో ప్రచారం కాంగ్రెస్ మాచవరం మండల కార్యదర్శి ఎలిసెట్టి బ్రహ్మానాయుడు, సిపిఎం పిడుగురాళ్ల మండల కార్యదర్శి టి.శ్రీనివాసరావు మాట్లాడుతూ సిమెంట్ ఫ్యాక్టరీ నిర్మాణం కోసం రైతుల నుండి తీసుకున్న భూములను రైతులకి తిరిగి ఇవ్వాలని లేదా ఫ్యాక్టరీ నిర్మించాలని, ప్రజలకు నీటి ఎద్దడి తీర్చాలని, ఏపీకి ప్రత్యేక హోదా ఇవ్వాలని, రైల్వేజోను, రాజధాని నిర్మాణం కార్యక్రమాలను ఇండియా వేదిక గెలిస్తే ఈ సమస్యలను పరిష్కరిస్తుందని అన్నారు. ప్రచార కార్యక్రమంలో జె.యోహాను, వెంకటేశ్వర్లు, షేక్ బాబు, రామకృష్ణ, మునీరు, గోవిందు, రావణ, లక్ష్మి, కోటిరెడ్డి పాల్గొన్నారు.

# గురజాల ఎన్నికల బరిలో వరసగా ఏడవసారి

### నేడు నామినేషన్ దాఖలు చేయనున్న యరపతినేని శ్రీనివాసరావు

ప్రజాశక్తి-పిడుగురాళ్ల

తొలిసారి గురజాల అభ్యర్థిగా ప్రకటించిన సందర్భంలో ఎన్‌టిఆర్‌తో యరపతినేని శ్రీనివాసరావు, తాజాగా చంద్రబాబు నుండి బీఫారం అందుకుంటూ..

గురజాల నియోజకవర్గం నుండి టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థిగా యరపతినేని శ్రీనివాసరావు ఏడోసారి నామినేషన్ వేయనున్నారు. గురజాల నియోజకవర్గంలో మాజీ ముఖ్యమంత్రి బ్రహ్మానందరెడ్డి, ఇతర ప్రముఖులు పోటీ చేసినా వారు రెండుసార్లే పోటీ చేశారు. జంగా కృష్ణ మూర్తి మాత్రం మూడుసార్లు పోటీ చేశారు. 1994లో ఎన్‌టిఆర్ నుండి టిడిపి అభ్యర్థిగా తొలిసారి బీ ఫారం అందుకున్న యరపతినేని శ్రీనివాసరావు అప్పటి నుంచి వరసగా పోటీ చేస్తున్నారు. పోటీ చేసిన తొలిసారే కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిపై 23967 ఓట్ల మోజార్టీతో విజయం సాధించారు. 1999 ఎన్నికల్లో 131 ఓట్లు తేడాతో ఓడిపోయారు. 2004 ఎన్నికల్లోనూ ఓటమి పాలయ్యారు. 2009, 2014 ఎన్నికల్లో వరసగా గెలుపొందారు. గురజాల, మాచర్ల నియోజకవర్గాల్లో అన్ని పార్టీలు అభ్యర్థులను వరుసగా మార్చేవి. టిడిపి తరుపున యరపతినేని శ్రీనివాసరావు మాత్రం కొనసాగుతూ వస్తున్నారు. ప్రస్తుత ఎన్నిల్లో పోటీకిగాను టిడిపి అధినేత చంద్రబాబు నుండి బీఫారం అందుకున్నట్లు యరపతినేని శ్రీనివాసరావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఏడు సార్లు నేను పోటే చేసేందుకు అవకాశం కల్పించిన చంద్రబాబుకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. మూడు సార్లు ఎమ్మెల్యేగా గెలిపించిన గురజాల నియోజకవర్గ ప్రజలకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

విలేకరులతో మాట్లాడుతున్న బొర్రా వెంకట అప్పారావు

## 23 స్వతంత్ర అభ్యర్థిగా నామినేషన్ వేస్తున్నా : బొర్రా వెంకట అప్పారావు

ప్రజాశక్తి - సత్తెనపల్లి రూరల్

తాను వైసిపిలోకి పోతానని, కాంగ్రెస్‌లో చేరుతానని దుష్ప్రచారం చేస్తున్నారని, అయితే తాను ఏ పార్టీలోనూ చేరబోడం లేదని, స్వతంత్ర అభ్యర్థిగా తాను 23న నామినేషన్ దాఖలు చేస్తున్నానని బొర్రా వెంకట అప్పారావు ప్రకటించారు. సత్తెనపల్లి మండలం ధూళిపాళ్లలోని తన కార్యాలయంలో ఆదివారం ఆయన విలేకర్లతో మాట్లాడారు. జనసేన నియోజకవర్గ ఇన్‌ఛార్జిగా ఉన్న తాను ఆ పార్టీకి రాజీనామా చేశానని చెప్పారు. 2008 ప్రజారాజ్యం పార్టీతో రాజకీయాల్లోకి వచ్చానని, 2022లో ధూళిపాళ్లలో జరిగిన కౌలురైతు భరోసా యాత్ర సభను నిర్వహించి పవన్ కళ్యాణ్ సమక్షంలో జనసేనలో చేరానని చెప్పారు. మంత్రి అంబటి రాంబాబుపై పోటీ చేసేందుకు అవకాశం ఇస్తానని పవన్‌కల్యాణ్ హామీ ఇచ్చినా పోత్తులో భాగంగా టిడిపికి కేటాయించారని అన్నారు. ఇతర ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజాప్రతినిధులు సత్తెనపల్లి ప్రాంత ప్రజలకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించక పోవటం వల్ల ఇక్కడి వారు వలసపోతున్నారని అన్నారు. నియోజకవర్గ సమస్యల పరిష్కారానికి స్థానిక నినాదంతో వావిలాల గోపాలకృష్ణయ్య స్ఫూర్తి, ఎన్టీఆర్ ఆత్మగౌరవ నినాదంతో స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేస్తున్నాని అన్నారు. అనంతరం ఎన్నికల ప్రచార రథాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా పలువురు జనసేనకు రాజీనామా చేశారు. వీరిలో నకరికల్లు మండల అధ్యక్షులు తాడువాయి లక్ష్మి, ఉపాధ్యక్షులు షేక్ రఫీ, ముప్పాళ్ళ మండల ఉపాధ్యక్షులు షేక్ గౌస్, సత్తెనపల్లి పట్టణం 7 వార్డు కౌన్సిలర్ రంగిశెట్టి సుమన్ కుమార్, సత్తెనపల్లి మండల మైనారిటీ అధ్యక్షులు షేక్ రఫీ ఉన్నారు.

## నేడు నంబూరు శంకరరావు నామినేషన్

ప్రజాశక్తి - పెదకూరపాడు

వైసిపి పెదకూరపాడు నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థిగా నంబూరు శంకరరావు సోమవారం నామినేషన్ వేయనున్నట్లు ఆయన వ్యక్తిగత కార్యదర్శి రాజు ఆదివారం ఒక ప్రకటనా ద్వారా తెలిపారు. అమరావతి మండలంలోని 14వ మైలు నుండి ర్యాలీగా పెదకూరపాడులోని తహశీల్దార్ కార్యాలయానికి వెళ్లి నామినేషన్ దాఖలు చేస్తారని తెలిపారు.

# ప్రజా సమస్యల పరిష్కారం కావాలంటే ఇండియా వేదిక అభ్యర్థులకు ఓటెయ్యండి

### సిపిఎం మంగళగిరి నియోజకవర్గ అభ్యర్థి జొన్నా శివశంకరరావు

ప్రజాశక్తి-తాడేపల్లి

ఎన్నికల్లో ప్రజలు విజ్ఞతతో ఆలోచించి ఓటు వేయాలని ఇండియా వేదిక బలపరిచిన మంగళగిరి సిపిఎం అభ్యర్థి జొన్నా శివశంకరరావు ప్రజ లను కోరారు. ఆది వారం తాడేపల్లి మేకా అమరారెడ్డి భవన్‌లో కాంగ్రెస్, సిపిఎం, సిపిఐ నాయకులతో కలిసి ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మంగళగిరిలో తనను కాంగ్రెస్, సిపిఐ, ఆమ్ ఆద్మీ తదితర 43 రాజకీయ పార్టీలు బలపరుస్తున్నాయని తెలిపారు. గుంటూరు పార్లమెంట్ అభ్యర్థిగా పోటీ చేస్తున్న జంగాల అజయ్‌కుమార్‌కు కంకి కొడవలి, తనకు సుత్తి కొడవలి నక్షత్రం గుర్తుపై ఓటు వేసి గెలిపించాలని కోరారు. గతంలో ప్రభుత్వాలు మారినా పేద ప్రజల సమస్యలు పరిష్కారం కావడంలేదని ఆవేదన వ్యక్తం చేశారు. పేద ప్రజల సమస్యలు పరిష్కారం కావాలన్నా, పెరిగిన ధరలను దించాలన్నా వామపక్ష అభ్యర్థులను గెలిపించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. మంగళగిరి నియోజకవర్గంలో వేలాది మంది పేదలకు ఇల్లు వేయించిన చరిత్ర సిపిఎందని స్పష్టం చేశారు. ప్రభుత్వ పోరంబోకు స్థలాల్లో నివాసముంటున్న పేదలు, రైల్వే స్థలాల బాధితుల కోసం నిత్యం పోరాడుతుందని కమ్యూనిస్టులేనని చెప్పారు. తాడేపల్లిలో అపార్టుమెంట్లు పెరిగిన తరువాత డ్రైనేజీ సమస్య ముందుకు వచ్చిందని చెప్పారు. డ్రైనేజీ వ్యవస్థను సరిచేసి భూగర్భ డ్రైనేజీ ఏర్పాటు చేసి సమస్యకు పరిష్కారం చూపుతామని హామీనిచ్చారు. సిఎం నివాసం ఉంటున్న ప్రాంతంలో బకింగ్ హామ్ కెనాల్ బ్రిడ్జి డబుల్ లైన్ బ్రిడ్జి ఏర్పాటుకు కృషి చేస్తామన్నారు. ప్రస్తుతం పేదలు నివాసం ఉంటున్న ఇళ్లను ఎక్కడికక్కడ రెగ్యులరైజేషన్ చేయిస్తామని హామీనిచ్చారు. వివిధ సామాజిక వర్గాలకు తాడేపల్లి పట్టణంలో శ్మశానవాటికలు లేక ఇబ్బందులు పడుతున్న తీరు తమ దృష్టికి వచ్చిందని, తనను గెలిపిస్తే శ్మశానవాటికలు ఏర్పాటుకు కృషి చేస్తానని అన్నారు. కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షులు దర్శనపు సామ్మేలు మాట్లాడుతూ ఇండియా వేదిక అభ్యర్థులను గెలిపించడం ద్వారా ఓ మంచి సంప్రదాయానికి శ్రీకారం చుట్టాలని కోరారు. వామపక్ష అభ్యర్థుల గెలుపుకు తమ శాయశక్తులా కృషి చేస్తామన్నారు. సిపిఐ పట్టణ సహాయ కార్యదర్శి టి.వెంకటయ్య మాట్లాడుతూ జొన్నా శివశంకరరావుకు సుత్తి కొడవలి నక్షత్రం, జంగాల అజయ్‌కుమార్‌కు కంకి కొడవలి గుర్తులపై ఓటు వేసి గెలిపించాలని కోరారు. 22వ తేదీ సోమవారం పది గంటలకు మంగళగిరిలో జరగనున్న ఇండియా వేదిక బలపరిచిన సిపిఎం అభ్యర్థి జొన్నా శివశంకరరావు నామినేషన్‌కు ప్రజలు తరలిరావాలని సిపిఎం, సిపిఐ, కాంగ్రెస్ నాయకులు పిలుపునిచ్చారు. సమావేశంలో సిపిఎం పట్టణ కార్యదర్శి బూరుగ వెంకటేశ్వర్లు, రూరల్ కార్యదర్శి దొంతిరెడ్డి వెంకటరెడ్డి, సోలా ముత్యాలరావు, చింతా శ్రీరామ్ పాల్గొన్నారు.

## ఒకేరోజు పదివేల కరపత్రాలు పంపిణీ

ప్రజాశక్తి-తాడేపల్లి

ఆదివారం ఒకే రోజు సిపిఎం కార్యకర్తలు పది వేల కరపత్రాలు పంపిణీ చేశారు. పట్టణంలోని అన్ని చర్చిల వద్ద ఉదయం ఏడు గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ఈ కార్యక్రమం నిర్వహించారు. బిజెపి అధికారంలోకి వచ్చిన తరువాత గత పదేళ్ల కాలంలో జరిగిన దాడులను ఆ కరప్రతంలో ప్రచురించారు. మళ్లీ బిజెపి అధికారంలో వస్తే దళితులు, ముస్లిం, క్రైస్తవుల మనుగడ ప్రశ్నార్థకంగా ఉంటుందని కరపత్రం ద్వారా వివరించారు. ఈ సందర్భంగా సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు ఎం.సూర్యారావు మాట్లాడారు. ఈ కార్యక్రమాల్లో , సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు వై.నేతాజీ, పట్టణ కార్యదర్శి బూరుగ వెంకటేశ్వర్లు, పట్టణ నాయకులు దొంతిరెడ్డి శ్రీనివాసకుమారి, కె.మేరి, వి.సామ్యేలు, వేముల దుర్గారావు, ఎ.శౌరిబర్తులం, వి.శాస్త్రి, బి.యేషయ్య, ఎన్.దుర్గారావు, బి.ప్రభాకర్, ఎస్ఎం బాష, జి.అంజిరెడ్డి, డి.విజయబాబు, వై.శ్రీనివాసరావు, ఫిరోజ్, కొట్టె కరుణాకరరావు, ఎస్.గిరిజ, కె.ఉషారాణి పాల్గొన్నారు.

## ఎమ్మెల రామయ్య కాలనీలో సమావేశం

ప్రజాశక్తి-తాడేపల్లి

ప్రజల మధ్య మత విద్వేషాలు రెచ్చగొడుతున్న బిజెపి, దాని మిత్రులను ఓడించాలని సిపిఎం పట్టణ నాయకులు వేముల దుర్గారావు కోరారు. ఆదివారం తాడేపల్లి ఎమ్మెల రామయ్య కాలనీలో జరిగిన జనరల్ బాడీ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. దేశంలో ప్రజల మత చిచ్చు పెట్టి, రాష్ట్రానికి ప్రత్యేక హోదా ఇవ్వని బిజెపికి టిడిపి, వైసిపి ఎందుకు మద్దతు ఇస్తున్నాయో ప్రజలకు చెప్పాలన్నారు. రాష్ట్ర ప్రజల ఆత్మగౌరవాన్ని వైసిపి తాకట్టు పెట్టి బిజెపి ముందు ఎందుకు సాగిల పడిందో చెప్పాలన్నారు. మంగళగిరి నియోజకవర్గంలో అధికారంతో నిమిత్తం లేకుండా నిత్యం ప్రజల మధ్య ఉంటున్న అసెంబ్లీకి సిపిఎం అభ్యర్థి జొన్నా శివశంకరరావు, పార్లమెంట్‌కు సిపిఐ అభ్యర్థి జంగాల అజయ్‌కుమార్‌లను గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో రమణ, వెంకన్న, ఉపేంద్ర, లక్ష్మి, శ్రీను పాల్గొన్నారు.

## కమ్యూనిస్టుల గెలుపుతో కార్మికుల సమస్యలు పరిష్కారం

ప్రజాశక్తి - మంగళగిరి :భవన నిర్మాణ కార్మికుల సమస్యలు పరిష్కారం కావాలంటే రానున్న ఎన్నికల్లో కమ్యూనిస్టు పార్టీల అభ్యర్థులను గెలిపించుకోవాలని భావన నిర్మాణ రంగం సంఘం జిల్లా కార్యదర్శి దండా లక్ష్మీనారాయణ అన్నారు. ఆదివారం మంగళగిరి పాత బస్టాండ్ సెంటర్లో ఇండియా బ్లాక్ వేదిక తరపున మంగళగిరి అసెంబ్లీకి సిపిఎం అభ్యర్థిగా పోటీ చేస్తున్న జొన్న శివశంకరరావును, పార్లమెంటుకు పోటీ చేస్తున్న జంగాల అజయ్ కుమార్‌ల విజయాన్ని కాంక్షిస్తూ సమావేశం జరిగింది. ఈ సమా వేశంలో లక్ష్మీనారాయణ మాట్లాడుతూ మోడీ ప్రభుత్వం కార్మిక వ్యతిరేక విధానాలను అవలంబిస్తుందని విమర్శించారు. రానున్న ఎన్నికల్లో బిజెపిని దాని మిత్రులను, వైసిపి పార్టీలను ఓడించాలని పిలుపునిచ్చారు. 22వ తేదీన సిపిఎం అభ్యర్థి జొన్న శివశంకరరావు నామినేషన్‌కు పెద్ద సంఖ్యలో తరలిరావాలని పిలుపు నిచ్చారు. సమావేశంలో భవన నిర్మాణ కార్మిక సంఘం పట్టణ అధ్యక్ష కార్యదర్శులు టి శ్రీనివాసరావు, షేక్ జానీ భాష, నండూరి శివ, సిఐటియు నాయకులు వై కమలాకర్, ఏం బాలాజీ, కాసిం, ఎం వెంకటరావు, నికల్సన్, జి జాషయ్య పాల్గొన్నారు.

## వడ్డేశ్వరంలో సిపిఎం శ్రేణుల విస్తృత ప్రచారం

### ఇండియా వేదిక అభ్యర్థులను గెలిపించండి

### సిపిఎం నాయకురాలు వంకాయలపాటి శివనాగరాణి

ప్రజాశక్తి - తాడేపల్లి రూరల్

నరేంద్ర మోడీ విధానాలకు వ్యతిరేకంగా, మతోన్మాద బిజెపిని ఓడించేందుకు రానున్న ఎన్నికలలో ఇండియా కూటమి వామపక్ష అభ్యర్థులను గెలిపించాలని, సిపిఎం పార్టీ నాయకురాలు వంకాయలపాటి శివనాగ రాణి అన్నారు. ఆదివారం ఎంపీఎంసీ పరిధిలోని వడ్డేశ్వరం గ్రామంలో సిపిఎం నాయకులతో కలిసి, వామపక్ష అభ్యర్థులను గెలిపించాలని ఆమె విస్తత ప్రచారాన్ని నిర్వహించారు. సిపిఎం నాయకులు ఇంటింటి ప్రచారాన్ని నిర్వహిస్తూ కరపత్రాలు పంపిణీ చేసి, మంగళగిరి శాసనసభ సిపిఎం అభ్యర్థి జొన్న శివశంకరరావుకు సుత్తి, కొడవలి, నక్షత్రం గుర్తుపైన, గుంటూరు పార్లమెంట్ సిపిఐ అభ్యర్థి జంగాల అజయ్ కుమార్ కు కంకి కొడవలి గుర్తు పైన ఓట్లు వేసి గెలిపించాలని ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా శివ నాగరాణి మాట్లాడుతూ ఉపాధి హామీ చట్టాన్ని నిర్వీర్యం చేసి, పేదలకు ఉపాధి లేకుండా పొట్ట కొట్టారని మండిపడ్డారు. రాష్ట్రానికి ప్రత్యేక హోదా ఇవ్వకుండా, రాజధాని నిర్మాణం చేపట్టకుండా అన్యాయం చేసిన నరేంద్ర మోడీ బిజెపి ప్రభుత్వాన్ని గద్దె దించాలని అన్నారు. దేశానికి ప్రమాదంగా మారిన బిజెపి దాని పొత్తు పార్టీలైన తెలుగుదేశం, జనసేన, నిరంకుశ వైఖరి అవలంబిస్తున్న వైసీపీ పార్టీలను ప్రజలు వ్యతిరేకించాలన్నారు. నిరంతరం ప్రజా సమస్యల పైన పోరాటాలు నడిపే వామపక్ష అభ్యర్థులను ఓట్లు వేసి గెలిపించాలన్నారు. కార్యక్రమంలో సిపిఎం తాడేపల్లి మండల కార్యదర్శి దొంతి రెడ్డి వెంకటరెడ్డి, సిపిఎం గుంటూరు జిల్లా నాయకులు బి ముత్యాలరావు, బి రాజ్ కుమార్, సిపిఎం తాడేపల్లి మండల నాయకులు పల్లె కృష్ణ, కంచర్ల సాంబశివరావు, కారసాల సౌరి తదితరులు పాల్గొన్నారు.

## నా ఆలోచనలకు ప్రతిరూపమే అమరావతి ఉద్యమం

### అయినా చంద్రబాబు పట్టించుకోలేదు

### పొలిటికల్ కన్సల్టెంట్ పోలవరపు రాకేష్ కుమార్

ప్రజాశక్తి - మంగళగిరి

అమరావతి రైతుల ఉద్యమంలో తన ఆలోచనలను ఉప యోగించుకొని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తనను పట్టించుకోవడం లేదని పొలిటికల్ కన్సల్టెంట్ రాకేష్ కుమార్ విమర్శించారు. మంగళగిరి నగరంలోని ప్రెస్ క్లబ్‌లో ఆదివారం జరిగిన విలేకరుల సమావేశంలో రాకేష్ కుమార్ మాట్లాడుతూ రాజధాని రైతుల ఉద్యమం తన ఆలోచనకు ప్రతి రూపం అని అన్నారు. తనను సంప్రదించకుండా ఉద్యమం చేపట్టారని పేర్కొంటూ రాకేష్ కుమార్ శనివారం రాత్రి మంగళగిరి రూరల్ పోలీస్ స్టేషన్లో, మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఎమ్మెల్సీ అశోక్ కుమార్, పిఏ రాజగోపాల్ లపై ఫిర్యాదు చేసానని తెలిపారు. మిమ్మల్ని పట్టించుకుని సందర్భంలో మరి అమరావతి ఉద్యమం జరిగే సమయంలోనే మీరు మీడియా ముందుకు ఎందుకు రాలేదు అంటూ విలేకరులు పలు ప్రశ్నలు అడగగా, రాకేష్ కుమార్ స్పష్టమైన సమాధానం ఇవ్వలేకపోయారు.

సమావేశంలో మాట్లాడుతున్న చందు సాంబశివుడు

## తెనాలిలో రేపు షర్మిల పర్యటన

ప్రజాశక్తి-తెనాలిరూరల్

ఏప్రిల్ 23న ఎపిసిసి అధ్యక్షులు వైఎస్ షర్మిల తెనాలిలో పర్యటించనున్నట్లు నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి డాక్టర్ చందు సాంబశివుడు అన్నారు. స్థానిక పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. రానున్న సార్వత్రిక ఎన్నికల ప్రచారంలో భాగంగా మంగళ వారం సాయంత్రం తెనాలి మార్కెట్ సెంటర్ వద్ద జరిగే బహిరంగ సభలో షర్మిల పాల్గొంటారని తెలిపారు. కార్యకర్తలు నాయకులు అధికసంఖ్యలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. గుంటూరు జిల్లా అధ్యక్షులు లింగంశెట్టి ఈశ్వరరావు ఆధ్వర్యంలో సభ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో పొన్నూరు నాగసూర్, శశిధర్ రావు, కర్లపూడి బుల్లియ్య, సిద్ధల రామకృష్ణ, పున్నారావు, మల్లవరపు ప్రసాద్ పాల్గొన్నారు.

ప్రచారం నిర్వహిస్తున్న జంగాల తదితరులు

## సిపిఐ అభ్యర్థి జంగాల అజయ్‌కుమార్ ప్రచారం

ప్రజాశక్తి-గుంటూరు

ఇండియా బ్లాక్ బలపరిచిన గుంటూరు పార్లమెంట్ సిపిఐ అభ్యర్థి జంగాల అజయ్‌కుమార్‌ను గెలిపించాలని కోరుతూ అభ్యర్థితోపాటు, సిపిఐ నాయకులు, కార్యకర్తలు స్థానిక ఏటి అగ్రహారంలో ప్రచారం నిర్వహించారు. కంకి కొడవలి గుర్తుపై ఓటు వేసి జంగాలను గెలిపించాలని కోరుతూ ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ నగర కార్యదర్శి కోట మాల్యాద్రి, జిల్లా నాయకులు మేడా హనుమంతరావు, ఇప్టా జాతీయ కార్యదర్శి గని, సిపిఐ నగర కార్యదర్శివర్గ సభ్యులు రావుల అంజిబాబు తదితరులు పాల్గొన్నారు.



ప్రారంభిస్తున్న వై నేతాజీ

## సుందరయ్య నగర్‌లో చలివేంద్రం ప్రారంభం

**ప్రజాశక్తి-తాడేపల్లి :** వేసవిలో ప్రజల దాహార్తిని తీర్చడానికి పట్టణంలోని సుందయ్యనగర్ బత్తుల రాజు భవనం వద్ద సిపిఎం ఆధ్వర్యంలో చలివేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ఆదివారం సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు వై.నేతాజీ చలివేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటువంటి సేవా కార్యక్రమాలు మరిన్ని నిర్వహించాలని ఆకాంక్షించారు. ప్రజలకు ఎల్లవేళలా అండగా ఉండేది సిపిఎం అని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు ఎస్.వెంకట్రావు, కొట్టె కరుణాకరరావు, పి.రామచంద్రరావు, డి.రామారావు, కొండబాబు, సురేంద్ర, ఫణీంద్ర, సాయి, శేఖర్, బాష, కె.ప్రభాకరరావు, రవి, ఆంటోని, శివ పాల్గొన్నారు.

**ప్రజాశక్తి - తుళ్లూరు :** మండలంలోని దొండపాడు అంబేద్కర్ కాలనీలో ఆదివారం చలివేంద్రం ప్రారంభించారు. నెల్లూరి వెంకటేశ్వ రావు జ్ఞాపకార్థం ఆయన కుమారులు వేణు, మురళి చొరవతో చలివేంద్రాన్ని ఏర్పాటు చేశారు. మాజీ ఎంపిటి సి సభ్యులు నెలకుదిటి వెంకటేశ్వరావు, మైనేని గిరిజ, నెలకుదిటి వెంకటపతిరావు, కాకా నాగేశ్వరరావు ప్రారంభించారు. కార్యక్రమంలో స్ఫూర్తి సేవా సంస్థ వ్యవస్థాపకులు టి రవి, సరిగల కిట్టయ్య, గుడిమెట్ల వెంకట్రావు అంబేద్కర్ యూత్ సభ్యులు పాల్గొన్నారు.

# కూటములు కుట్రలు చేసినా గెలిచేది రాంబాబే

## వైసిపి నరసరావుపేట ఎంపీ అభ్యర్థి అనిల్‌కుమార్ యాదవ్

ప్రజాశక్తి - సత్తెనపల్లి టౌన్

కూటములు ఎన్ని కుట్రలు చేసినా సత్తెనపల్లిలో గెలిచేది అంబటి రాంబాబేనని వైసిపి నర్సరావుపేట ఎంపి అభ్యర్థి అనిల్ కుమార్ యాదవ్ అన్నారు. స్థానిక వైసిపి కార్యాలయంలో రాంబాబుతో కలిసి ఆయన ఆదివారం విలేకర్లతో మాట్లాడారు. నియోజకవర్గంలోని వైసిపి నాయకులంతా ఏకమై అంబటి రాంబాబు విజయానికి కృషి చేస్తున్నారని చెప్పారు. ఈ నియోజకవర్గాన్ని వైసిపికి కంచుకోటగా నిర్మించాలన్నారు. రాంబాబు మాట్లాడుతూ నియోజకవర్గంలో అసంతృప్తులు గుసగుసలకు తెరదించుతూ ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించామన్నారు ఎవరైనా అధిష్టానం నిర్ణయానికి కట్టుబడి ఉండాల్సిందేనని చెప్పారు. ఈ నెల 24న అనిల్ కుమార్ యాదవ్, 25న తాను నామినేషన్లు వేస్తామని, శ్రేణులు భారీగా తరలిరావాలని కోరారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే యర్రం వెంకటేశ్వరరెడ్డి, గుబ్బా చంద్రశేఖర్, డాక్టర్ గజ్జల నాగభూషణరెడ్డి, చిట్టా విజయభాస్కరరెడ్డి, ఎన్.రాజానారాయణ పాల్గొన్నారు.

ప్రజాశక్తి - నకరికల్లు

అర్హతున్న ప్రతి పేదవాడికి సంక్షేమ పథకాలు అందాలంటే వైసిపిని గెలిపించాలని ఆ పార్టీ సత్తెనపల్లి ఎమ్మెల్యే అభ్యర్థి అంబటి రాంబాబు అన్నారు. మండలంలోని దేచవరంలో ఆదివారం భవనం రాఘవరెడ్డి సమక్షంలో సుమారు 25 కుటుంబాలు టిడిపిని వీడి వైసిపిలో చేరాయి. వీరికి పార్టీ జెండాలను రాంబాబు కప్పి ఆహ్వానించారు. అనంతరం గ్రామంలో ప్రచారం నిర్వహించారు. నాయకులు ఎం.ప్రవీణ్ కుమార్‌రెడ్డి, హుస్సేన్‌బి, బాషా, డి.కోటిరెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.

ప్రజాశక్తి - సత్తెనపల్లి రూరల్

మండలంలోని భృగుబండ గ్రామంలో ఆదివారం నిర్వహించిన శ్రీ సుభద్ర బలరామ సమేత జగన్నాధ స్వామి ఆలయ పున్న ప్రతిష్టలో సత్తెనపల్లి వైసిపి అభ్యర్థి అంబటి రాంబాబు, నరసరావుపేట ఎంపీ అఅభ్యర్థి అనిల్ కుమార్ యాదవ్ పాల్గొన్నారు. వీరిని కమిటీ నిర్వాహకులు సత్కరించారు.

# విద్యార్థుల ఫీజులు ఎగ్గొట్టిన జగన్ : జీవీ ఆంజనేయులు

ప్రజాశక్తి-ఈపూరు

పేద విద్యార్థుల ఫీజులు కూడా ఎగ్గొట్టిన దొంగమామ ముఖ్యమంత్రి జగన్‌రెడ్డి అని ఎన్‌డిఎ కూటమి తరుపున వినుకొండ నియోజకవర్గ టిడిపి అభ్యర్థి జీవీ ఆంజనేయులు ఎద్దేవా చేశారు. రూ.30వేల కోట్ల రూపాయలకు పైగా బకాయిలు పెట్టి, ఈ ఏడాది ఒక్క రూపాయి కూడా ఇవ్వకుంటే పిల్లల చదువులెలాగని ప్రశ్నించారు. ఆదివారం ఈపూరు మండలం వనికుంట, ఎ ద్ కొం డా య్ ం పా లె ం, చినకొండాయపాలెం, బొగ్గరంలో మాజీ ఎమ్మెల్యే మక్కెన మల్లికార్జునరావు, జనసేన పార్టీ నాయకులు ఎన్.శ్రీనివాసరావుతో కలసి జీవీ ఆంజనేయులు ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన టిడిపి సూపర్ సిక్స్ పథకాలతో కలిగే ప్రయోజనాలను వివరించి కరపత్రాలు పంపిణీ చేశారు. టిడిపి ప్రభుత్వంలో విద్యా, ఉపాధి రంగాలకు ఇచ్చిన ప్రాధాన్యం జగన్ ఏలుబడిలో మచ్చుకైనా కనిపించలేదన్నారు. అతడి అయిదేళ్ల పాలనలో పేద తల్లులపై ఫీజుల రూపంలో రూ. 3,174 కోట్లు భారం వేశారని విమర్శించారు. పూర్తి కావొస్తున్న విద్యా సంవత్సరానికి కూడా నాలుగు విడతలుగా వేయాల్సి ఉండగా ఒక్క త్రైమాసికానికే బటన్ నొక్కి, అందులోనూ 50 శాతం మంది ఖాతాల్లో ఇప్పటికీ డబ్బులు వేయలేదని ధ్వజమెత్తారు. పైగా పోస్ట్ గ్రాడ్యుయేషన్‌కు ప్రైవేటు కాలేజీల్లో ఫీజుల చెల్లింపులు నిలిపివేశారన్నారు. విద్యార్థులెవరూ అధైర్య పడొద్దని, టిడిపి ప్రభుత్వం రాగానే వారందరికీ అండగా ఉంటామని అన్నారు. వినుకొండ నియోజకవర్గంలో చదువుకునే ప్రతి విద్యార్థికి న్యాయం చేసే బాధ్యత తనదన్నారు. సూపర్‌సిక్స్ పథకంలో భాగంగా వారికి ఆర్థిక సాయంతో పాటు తనవంతు సాయంగా ఏటా 1000 మంది విద్యార్థులకు ఉపకార వేతనాలు అందించనున్నట్లు తెలిపారు. ఏటా వంద మంది ముస్లిమ్ విద్యార్థులకు ప్రత్యేక స్కాలర్‌షిప్‌లు ఇస్తామన్నారు. మాజీ ఎమ్మెల్యే మక్కెన మాట్లాడుతూ సార్వత్రిక ఎన్నికల్లో వైసిపి అభ్యర్థులు డబ్బు వెదజల్లేందుకు సిద్ధమయ్యారని, వారు ఓటుకు ఎంత ఇచ్చినా తీసుకొని ఓటు మాత్రం టిడిపికి వేయాలన్నారు.కార్యక్రమంలో నాయకులు ఆర్.జగ్గారావు, టి.బాలయ్య, ఎ.కోటేశ్వరరావు, బి.సుబ్బరాయుడు, బి.వెంకటసుబ్బయ్య, జి.నరేంద్ర, ఎన్.కిషోర్ పాల్గొన్నారు.

## ప్రతి విషయాన్ని క్షుణ్ణంగా పరిశీలించండి

ప్రజాశక్తి - సత్తెనపల్లి రూరల్

పోలింగ్ కేంద్రాల్లో జరిగే ప్రతి విషయాన్ని క్షుణ్ణంగా పరిశీలించాలని సూక్ష్మ పరిశీలకులకు సత్తెనపల్లి నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి వి.మురళీకృష్ణ సూచించారు. సత్తెనపల్లి జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో ఆదివారం నిర్వహించిన శిక్షణలో రిటర్నింగ్ అధికారి మాట్లాడుతూ ఈవీఎం, పోస్టల్ బ్యాలెట్‌పై అవగాహన కల్పించారు. తహశీల్దార్ ఉషా, మున్సిపల్ కమిషనర్ కె.షమీ పాల్గొన్నారు.

ప్రజాశక్తి - పెదకూరపాడు

సాధారణ ఎన్నికలలో మైక్రో అబ్జర్వర్లుగా పని చేసే వారికి ఒకరోజు శిక్షణ కార్యక్రమం క్రోసూరులోని పాలిటెక్నిక్ కాలేజీలో ఆదివారం జరిగింది. నియోజకవర్గ రిటర్నింగ్ ఆఫీసర్ శ్రీరాములు పలు అంశాలను వివరించారు. ఈఆర్వో ప్రభాకర్‌రావు, సిబ్బంది పాల్గొన్నారు.

## బొగ్గవరపు వీరయ్య సంతాప సభ

ప్రజాశక్తి - చిలకలూరిపేట

మాజీమంత్రి పత్తిపాటి పుల్లారావు మావయ్య బొగ్గవరపు వీరయ్య సంతాప సభ స్థానిక పత్తిపాటి గార్డెన్స్‌లో ఆదివారం నిర్వహించారు. వీరయ్య చిత్రపటానికి పుల్లారావు సహా పలువురు పూలమాలలేసి నివాళులర్పించారు.

## 500 మందికి కంటి పరీక్షలు

ప్రజాశక్తి - పెదకూరపాడు

మండలంలోని లింగంగుంట్లలో ఆదివారం ఉచిత కంటి వైద్య శిబిరం జరిగింది. సుమారు 500 మందికి డాక్టర్ రహీం భాష ఆధ్వర్యంలో కంటి పరీక్షలు చేశారు. శిబిరాన్ని గ్రామానికి చెందిన టిడిపి నాయకులు సౌమిత్ చౌదరి ఏర్పాటు చేశారు.

# పల్నాడులో బీసీలపై పెరిగిన వైసిపి దాడులు : జంగా కృష్ణమూర్తి

ప్రజాశక్తి - విజయపురిసౌత్

పల్నాడులో బీసీలపై వైసిపి నేతల దాడులు ఎక్కువయ్యాయని ఎమ్మెల్సీ జంగా కృష్ణమూర్తి విమర్శించారు. మాచర్ల మండలం తాళ్లపల్లిలో ఆదివారం జరిగిన బీసీల ఆత్మీయ సమావేశానికి హాజరైన ఆయన మాట్లాడుతూ ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి అరాచకాలు ప్రోత్సహిస్తున్నారని, ఆ విధంగానే ఎన్నికల్లో గెలవాలని చూస్తున్నారని అన్నారు. ఎన్నికల నిర్వహణపై ఎలక్షన్ కమిషన్ ప్రత్యేక దృష్టి సారించాలని, ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో జరిగేలా చూడాలని కోరారు. గత రాత్రి కారంపూడి మండలం మిరియాల గ్రామంలో టిడిపి నేత బత్తుల శ్రీనివాస్ యాదవ్ ఏర్పాటు చేసిన ప్రచార కార్యక్రమంలో తాను పాల్గొనగా విశేష స్పందన రావడంతో శ్రీనివాస్ యాదవ్ ట్రాక్టర్ గడ్డివామును వైసిపి నాయకులు దహనం చేశారని అన్నారు. గతంలో మిరియాలలో టిడిపి అభ్యర్థి బ్రహ్మారెడ్డి ప్రచారం చేసిన ట్రాక్టర్‌ను వైసిపి నాయకులు తగులబెట్టారన్నారు. కార్యక్రమంలో నాయకులు టిడిపి, జనసేన నాయకులు ఎం.రాంబాబు, ఎన్.వీరస్వామి యాదవ్, సాంబశివరావు, జె.కొండలు, జి.శ్రీను, ఆర్.మధు, పెద్దిరాజు, హుస్సేను, కోటయ్య, బ్రహ్మయ్య పాల్గొన్నారు.

ప్రచారం నిర్వహిస్తున్న పిన్నెల్లి రామకృష్ణారెడ్డి భార్య రమాదేవి, జూలకంటి బ్రహ్మారెడ్డి భార్య శోభారాణి

# పతుల విజయం కోసం సతుల ప్రచారం

ప్రజాశక్తి-మాచర్ల

మాచర్ల అసెంబ్లీ నియోజకవర్గం నుంచి వైసిపి అభ్యర్థిగా పిన్నెల్లి రామకృష్ణారెడ్డి, ఎన్‌డిఎ కూటమి తరుపున బిజెపి, జనసేన బలపర్చిన టిడిపి అభ్యర్థి జూలకంటి బ్రహ్మానందరెడ్డి పోటి చేస్తున్నారు. నువ్వా నేనా అన్నట్లు పోటీ నెలకొన్న నేపథ్యంలో ఉధృతంగా వీరి ప్రచారం సాగుతోంది. వీరికి తోడుగా భార్యలు కూడా ప్రచారంలో దిగారు. స్థానిక రోప్‌లైన్ కాలనీలో రామకృష్ణారెడ్డి భార్య రమాదేవి ఇంటింటికీ తిరిగి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. పట్టణంలోని ఎరుకల కాలనీ, కోడెల శివప్రసాద్ కాలనీలో జూలకంటి బ్రహ్మారెడ్డి భార్య శోభారాణి, కుమారుడు గౌతమ్‌రెడ్డి ఆదివారం ఇంటింటికి తిరిగి ప్రచారం చేశారు.

# అధికారం కోసం కుట్రలు : టిడిపి

ప్రజాశక్తి - విజయపురిసౌత్

సిఎం జగన్‌పై రాయి దాడి ఘటనలో వడ్డెర సామాజిక తరగతికి చెందిన వారిపై అక్రమ కేసులు పెట్టారని, అధికారం కోసం కోసం బడుగు బలహీన వర్గాలను టార్గెట్ చేసి ఇబ్బందులు పెడుతున్నారని టిడిపి నాయకులు ఆరోపించారు. ఈ మేరకు నాయకులు కె.దుర్గారావు, ఎం.వెంకటేశ్వర్లు, బి.శ్రీను, పెద్ద అంజి తదితరులు కేసులను ఖండించారు. ఇదంతా ముఖ్యమంత్రి ఆడుతున్న కొత్త డ్రామా అన్నారు.

## ఈ ఎన్నికల్లో 80 శాతం ఓట్లు సాధించడమే లక్ష్యం : పుల్లారావు

ప్రజాశక్తి - చిలకలూరిపేట

ఈ ఎన్నికల్లో పోలయ్యే ఓట్లలో కనీసం 80 శాతం సాధించడమే లక్ష్యమని ఎన్‌డిఎ కూటమి తరుపున చిలకూరిపేట ఎమ్మెల్యేగా పోటీ చేస్తున్న టిడిపి అభ్యర్థి పత్తిపాటి పుల్లారావు అన్నారు. 20 రోజులక కష్టపడి ఇంటింటికీ తిరిగితే వైసిపికి డిపాజిట్లు కూడా రావన్నారు. మండల పరిధిలోని ఏలూరులో మల్లెల రాజేష్ నాయుడుతో కలిసి ఆదివారం ఎన్నికల ప్రచారం చేశారు. అభివృద్ధి, సంక్షేమం, రాజధాని అమరావతి, పోలవరం నిర్మాణం పూర్తి చేయడమే కూటమి అజెండా అన్నారు. తన కుమారుడు శరత్‌ను అన్యాయంగా 20 రోజులు జైలులో పెట్టారని, అయినా ఆరోపణలేమీ నిరూపించలేకపోయారని విమర్శించారు. వైసిపి ప్రభుత్వంలో నిరుపేదలే ఎక్కువగా నష్టపోయారన్నారు. దళితులకు చెందిన 27 పథకాలను రద్దు చేశ్శారని, మైనార్టీల పథకాలను అంతే చేశారని అన్నారు. రైతులకు అందించే వ్యవసాయ పనిముట్లను ఆపేశారని విమర్శించారు. మంగళవారం తన నామినేషన్‌కు పెద్దఎత్తున తరలిరావాలని కోరారు.

ప్రజాశక్తి
7
గుంటూరు జిల్లా
సోమవారం 22 ఏప్రిల్ 2024

# నిర్లక్ష్యానికి నిలువెత్తు నిదర్శనం

## తుళ్లూరు - రాయపూడి రహదారి

**ప్రజాశక్తి - తుళ్లూరు**

తుళ్లూరు - రాయపూడి మధ్య ప్రధాన రహదారి ప్రమాదాలకు నెలవుగా, ప్రభుత్వ యంత్రాంగం నిర్లక్ష్యానికి నిలువెత్తు నిదర్శనంగా మారింది. ఈ రోడ్డు మార్గంలో ప్రయాణం అంటే వాహనదారులు హడలిపోతున్నారు. అధికారులు శాశ్వత పరిష్కారం దిశగా చర్యలు తీసుకోక పోయినా కనీసం రోడ్డు మరమ్మతులు చేపట్టక పోవడం విమర్శలకు గురవుతోంది. రోడ్డు కోసుకు పోయి పెద్ద గుంతలు పడడంతో నిత్యం ప్రమాదాలు జరుగుతున్నాయి. రాయపూడి దగ్గర హోసన్నా మందిరం నుంచి తుళ్లూరు వైపు వచ్చే మార్గంలో 50 అడుగులకొక గుంత దర్శన మిస్తోంది. గుంతలతో ప్రయాణం ప్రాణసంకటంగా మారిందని వాహనదారులు ఆందోళన చెందుతున్నారు.గుంటూరు నుంచి సచివాలయంకు ఉద్యోగులు,తుళ్లూరు పరిసర ప్రాంతాల నుంచి సిబ్బంది ఈరోడ్డు మీదుగానే నిత్యం ప్రయాణం చేస్తుంటారు. గుంటూరు నుంచి సచివాలయం, హైకోర్టు కు ఈ రోడ్డు మార్గానే ఆర్టీసీ బస్సులు తిరుగు తుంటాయి. కొంతమంది ద్విచక్ర వాహనాలు, కార్లలో ప్రయాణం సాగిస్తుంటారు. ఆటోలు, ఇసుక లారీలు కూడా పెద్ద సంఖ్యలో తిరుగు తుంటాయి. దీంతో ఈ మార్గం నిత్యం రద్దీగా ఉంటుంది. దూరప్రాంతాల నుంచి వచ్చే వారికి ఈ రోడ్డు పై ఉన్న గుంతలు గురించి పూర్తి అవగాహన లేకపోవడంతో ప్రమాదాలకు గురవుతున్నారు. రోడ్డు అంచులు కోసుకుపోయి ఉండడంతో వాహనాలు జారి ప్రమాదాలు జరుగుతున్నాయని వాహనదారులు వాపోతున్నారు. ప్రధానంగా రాత్రి వేళల్లో ఎదురుగా వచ్చే వాహనాలను తప్పించే క్రమంలో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. గతంలో అనేకసార్లు ద్విచక్ర వాహనాలపై వెళ్లే వారు, ఆటోలు ప్రమాదాలకు గురికావడం, తీవ్రంగా గాయపడడం జరిగింది. రోడ్డు పాడై ప్రమాదాలు జరుగుతున్నా అధికారులు ఏ మాత్రం పట్టించుకోవడం లేదని వాహన దారులు మండిపడుతున్నారు.ఇక్కడ తరచూ ప్రమాదాలు జరుగుతున్నా ఆర్ అండ్ బి అధికారులు కనీస జాగ్రత్తలు తీసుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.ప్రమాద హెచ్చరిక బోర్డులు కూడా ఏర్పాటు చేయకుండా చోద్యం చూస్తున్నారని, నిత్యం రద్దీగా ఉండే రోడ్డు మార్గాల్లో కనీస జాగ్రత్తలు కూడ తీసుకోరా.. అని ప్రశ్నిస్తున్నారు.

ప్రమాదాలకు నిలయంగా తుళ్లూరు - రాయపూడి రహదారి

# అందమైన సమాజమే కుందుర్తి కవితా లక్ష్యం

**ప్రజాశక్తి-గుంటూరు**

అందమైన సమాజం కోసం కుందుర్తి కవిత్వం రాశారని ప్రముఖ సాహిత్య విశ్లేషకులు డాక్టర్ నల్లపనేని విజయలక్ష్మి అన్నారు. ఆదివారం గుంటూరు బ్రాడీపేటలోని సర్వీస్ హెల్త్ ఆర్గనైజేషన్ సమావేశ మందిరంలో 'అమరావతి సాహితీ మిత్రులు' నిర్వహించిన సాహిత్య కార్యక్రమంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. సరళమైన, సుందరశైలి జన సామాన్యానికి అవసరం అని భావించారని, వచన కవిత్వాన్ని ఒక ఉద్యమ స్థాయిలో ప్రచారం చేశారని ఆమె వివరించారు. కథలుగా, నాటకాలుగా కూడా వచన కవిత రావాలని ఆశించారని ఆమె అన్నారు. అమరావతి సాహితీ మిత్రులు సంస్థ అధ్యక్షులు డాక్టర్ రావిరంగారావు సభకు అధ్యక్షత వహించారు. ఆయన రూపొందించిన వచన కవిత మూల్యాంకనం స్కేలును సభలో వివరించారు. వచన కవిత్వం రాయటానికి కవులు గమనించాల్సిన అంశాలను అందులోంచి ప్రస్తావించారు. ప్రముఖ సాహితీవేత్త డాక్టర్ చిటిప్రోలు వెంకటరత్నం తుమ్మల రచించిన 'అమర జ్యోతి' గురించి ప్రసంగించారు. గాంధీజీ చనిపోయినప్పుడు రాసిన ఈకావ్యంలో విషాదాన్ని ప్రపంచ విషాదంగా అభివర్ణించా రన్నారు.ఆనాటి స్వతంత్ర సమర విషయ పరిజ్ఞానంతో పాటు గాంధీజీ నమ్మిన సిద్ధాంతాలు అందులో మనకు కనిపిస్తాయని, కరుణామూర్తిగా గాంధీజీని కమనీయంగా చిత్రించారని తుమ్మలను వెంకటరత్నం ప్రశంసించారు. 'ఈ మాసం' కవిగా డాక్టర్ మైలవరపు లలితకుమారి పాల్గొని వినిపించిన అనేక కవితలు సభను ఆకర్షించాయి. సంస్థ కన్వీనర్ పింగళి భాగ్యలక్ష్మి నిర్వహించిన కవి సమ్మేళనంలో గోలి హనుమత్ శాస్త్రి, వి.వి.రావు, బలభద్రపాత్రుని ఉదయ శంకర్, చల్లా సత్యవతి, యక్కంటి పద్మావతి, శేషుమాంబ, నల్లాన్ చక్రవర్తుల సుధామైథిలి, పూసపాటి కృష్ణ సూర్యకుమార్ కవితలు వినిపించారు. 'నిక్కచ్చి కవిత' కు ఎంపికైన గోలి హనుమత్ శాస్త్రిని, ఈ మాసం కవిగా పాల్గొన్న డాక్టర్ లలిత కుమారిని, మూడు నెలల మినీ కవితల పోటీలలో ఉత్తమ ప్రతిభ కనబరచిన ధనుంజయ రెడ్డిని సంస్థ తరపున రావి రంగారావు, చిటిప్రోలు వెంకటరత్నం, భాగ్యలక్ష్మి, డాక్టర్ టి. సేవకుమార్ మొదలైన వారు సత్కరించారు

హనుమత్‌శాస్త్రిని, లలితకుమారి తదితరులను సత్కరిస్తున్న రావి రంగారావు తదితరులు

# మల్లెల రాజు తల్లి కన్నుమూత

### నివాళులర్పించిన కిలారి, అంబటి మురళీకృష్ణ

**ప్రజాశక్తి - పొన్నూరు** :పట్టణం లోని 14వ వార్డుకి చెందిన వైసిపి పార్టీ సీనియర్ నాయకుడు మల్లెల రాజు తల్లి మృతి చెందారు. ఆమె గత కొన్ని రోజులుగా అస్వస్థకు గురై చికిత్స పొందుతూ . ఆదివారం కన్నుమూశారు. పొన్నూరు ఎమ్మెల్యే కిలారి రోశయ్య, పొన్నూరు వైసిపి అసెంబ్లీ అభ్యర్థి అంబటి మురళీకృష్ణ ఆమె భౌతికకాయానికి పూలమాలవేసి ఘనంగా నివాళులు అర్పించారు. ముస్లిం మైనార్టీ నాయకులు షేక్ నాజర్, గూడవల్లి గంగాధర్, ఆకుల వెంకటేశ్వరరావు, ఎంఏ మహమ్మద్, డాక్టర్ రూత్ రాణి, తదితరులు మల్లెల రాజు కుటుంబ సభ్యులను పరామర్శించే ప్రగాఢ సంతాపం సానుభూతి తెలియజేశారు.

# 24న న్యాక్ బృందం వర్సిటీ సందర్శన

**ప్రజాశక్తి - ఎఎన్‌యు**

న్యాక్ (నేషనల్ అసెస్మెంట్ అండ్ అక్రిడిడేషన్ కౌన్సిల్) పీర్ కమిటీ పర్యటనను విజయవంతం చేయాలని వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ పి. రాజశేఖర్ పిలుపునిచ్చారు. ఆదివారం అధ్యాపకులతో జరిగిన ప్రత్యేక సమావేశంలో ఈ మేరకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇప్పటివరకు విభాగాలు సహకరించిన తీరు అభినందనీయమని ఈ నెల 24 నుంచి 26 వరకు న్యాక్ బృందం విశ్వవిద్యాలయాన్ని సందర్శించనున్న నేపథ్యంలో ఆయా విభాగాలు సాధించిన ప్రగతిని పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరాలను కమిటీ సభ్యులకు సూచించాలని తెలిపారు. అనంతరం విభాగాల్లో ఉన్న లేబరేటరీలు, స్మార్ట్ క్లాస్ రూమ్ లను చూపాలని పేర్కొన్నారు. విభాగాలు, పరిశోధన అధ్యయన కేంద్రాలు, రీసెర్చ్ సెంటర్లు, నాన్ టీచింగ్ సెక్షన్లు అన్నీ కూడా ఏర్పాట్లు చేసుకోవాలని ఆదేశించారు. గత న్యాక్ పర్యటన నుంచి నేటి వరకు జరిగిన విభాగాల పనితీరు, సాధించిన ర్యాంకులు, పొందిన అవార్డులు, విభాగం ప్రగతి, పురోగతి వంటి అన్ని విషయాలను సిద్ధం చేయాలని సూచించారు. వర్సిటీ భవిష్యత్తుకు న్యాక్ ర్యాంకింగ్ ఎంతో దోహదం పడుతుందన్నారు. ప్రతి ఒక్కరూ తమ వంతు సహాయ సహకారాలు అందిస్తే న్యాక్ ఏ డబుల్ ప్లస్ వంటి ఉన్నత స్థాయి ర్యాంకును పొంది రాష్ట్రంలో అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న విశ్వవిద్యాలయంగా రూపాంతరం చెందుతామని పేర్కొన్నారు. అంతర్జాతీయ స్థాయి విద్యాసంస్థలతో వ్యాపార సంస్థలతో అనుసంధానం పెరుగుతుందని పేర్కొ న్నారు. తద్వారా వర్సిటీని గ్లోబల్ స్థాయి విశ్వవిద్యాలయంగా నిలుపుకునేందుకు అవకాశం ఉంటుందన్నారు. న్యాక్ పర్యటన పూర్తయ్యే వరకు ఎవరు కూడా సెలవులు తీసుకోవద్దని సూచించారు. విభాగాలు సాధించిన పరిశోధనలు తప్పనిసరిగా తెలియజేప్పాలన్నారు. వర్శిటీ కి ప్రధాన కేంద్రముగా ఉన్న దూరవిద్య కేంద్రం నుంచి న్యూఢిల్లీలోని డిస్టెన్స్ ఎడ్యుకేషన్ బ్యూరో ఆదేశాలతో ఆర్ట్స్, హ్యూమనిటీస్ కోర్సులను మాత్రమే నిర్వహిస్తున్నామని న్యాక్ లో ఉన్నత శ్రేణి ర్యాంక్ సాధించినట్లయితే సైన్స్ కోర్సులను కూడా ప్రారంభించు కునే వెసులుబాటు కలుగుతుందని పేర్కొన్నారు. ఐ క్యు ఏసి కి పంపిన సమాచారాన్ని సిద్ధంగా ఉంచాలని, ఉన్నది ఉన్నట్టు చెప్పాలని పేర్కొన్నారు.

# రోశయ్య, ఫాతిమా ప్రచారం

**ప్రజాశక్తి - గుంటూరు జిల్లా ప్రతినిధి**

గుంటూరు తూర్పు నియోజకవర్గం పాతగుంటూరు ఆనందపేటకు చెందిన 75 కుటుంబాలు టిడిపి నుంచి వైసిపిలో చేరారు. వైసిపి గుంటూరు పార్లమెంట్ అభ్యర్థి కిలారి వెంకట రోశయ్య సమక్షంలో ఆదివారంరాత్రి వైసిపి కండువా కప్పుకొన్నారు. సంక్షేమ పథకాలకు ఆకర్షితులై వేలాది మంది నిత్యం వైసిపిలో చేరుతున్నారని కిలారి రోశయ్య మీడియాకు తెలిపారు. స్థానిక ఆనంద్‌పేట, సంగడిగుంట, లాంచెస్టర్ రోడ్డు తదితర ప్రాంతాల్లో ఆయన ప్రచారం నిర్వహించారు. వైసిపి హయంలోజరిగిన అభివృద్ధి చూసి ఓర్వలేక ప్రతిపక్షాలు విమర్శలు చేస్తున్నాయని తెలిపారు. గుంటూరు తూర్పు అభ్యర్థి నూరిఫాతిమా తదితరులు ప్రచారంలో పాల్గొన్నారు.

# నెక్కల్లులో టిడిపి ప్రచారం

**ప్రజాశక్తి - తుళ్లూరు** మండలంలో నెక్కల్లు లో టిడిపి గెలుపును కాంక్షిస్తూ గుంటూరు పార్లమెంటు మైనార్టీ అధ్యక్షులు షేక్ అబ్దుల్ గని, తాడికొండ మాజీ ఎంపీపీ రిజ్వాన ముస్లిం మైనార్టీల ఏరియాలో ఆదివారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ప్రతి కుటుంబాన్ని కలిసి టిడిపి కి ఓటు వేసి గెలిపించాలని కోరారు. అమరావతి రాజధానిని నిర్మించుకుందామని చెప్పారు. ఎమ్మెల్యే అభ్యర్థి తెనాలి శ్రావణ్ కుమార్, గుంటూరు పార్లమెంట్ అభ్యర్థి పెమ్మసాని చంద్రశేఖర్‌ను భారీ మెజారిటీతో గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో నాగుల్ మీరా, జాన్ సాహెబ్,షేక్ మస్తాన్ వలీ, షేక్ రసూల్,షేక్ జాన్ సైదా, షేక్ మదార్ బుడే,పఠాన్ మస్తాన్ వలీ పాల్గొన్నారు.

# రెండు కిలోల గంజాయి పట్టివేత

**ప్రజాశక్తి - తాడేపల్లి**

సిఎం నివాసానికి కూతవేటు దూరంలోని క్రిస్టియన్‌పేటలో గంజాయి అమ్మజూపుతున్న ఇద్దర్ని స్థానికులు ఆదివారం రాత్రి బంధించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. తాడేపల్లి పోలీసులు ఆ ప్రాంతానికి చేరుకుని మలిశెట్టి (వంశీ), దుగ్గుల మల్లికార్జునరావు (మణికంఠ)ను అదుపులోకి తీసుకున్నారు. వారి నుండి రెండు కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. నిందితులను విచారించగా తాము విజయవాడకు చెందిన వారమని, విశాఖపట్నంలో చదువుతున్నామని, విశాఖ నుండి గంజాయి తెచ్చి తాడేపల్లికి చెందిన నాని అనే వ్యక్తి ద్వారా అమ్ముతున్నామని చెప్పారు. దీనిపై పోలీసులు కేసు నమోదు చేశారు.

# తాడేపల్లి మున్సిపల్ కార్యాలయం వద్ద రేపు ధర్నా

**ప్రజాశక్తి - మంగళగిరి**

మున్సిపల్ కార్మికులు సమ్మె చేసిన సందర్భంగా ప్రభుత్వం కార్మిక సంఘాల యూనియన్లతో చేసుకున్న ఒప్పందం ప్రకారం వేతనాలు ఇవ్వడం లేదంటూ కోరుతూ ఈనెల 23వ తేదీన తాడేపల్లి మున్సిపల్ కార్యాలయం ఎదుట ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ సిఐటియు ఆధ్వర్యంలో ధర్నా కార్యక్రమం జరుగుతుందని సిఐటియు జిల్లా నాయకులు ఎస్ ఎస్ చంగయ్య ఆదివారం ఒక ప్రకటన తెలిపారు. ప్రభుత్వం చేసుకున్న ఒప్పందం ప్రకారం నెలకు 21000 వేతనం ఇవ్వడం లేదని, సంక్రాంతి కానుక ఇవ్వలేదని తదితర సమస్యల డిమాండ్లతో ఈ ధర్నా కార్యక్రమం జరుగు తుందని తెలిపారు. జీవోలు ఇచ్చారు గాని అమలు చేయడం లేదని తెలిపారు. మున్సిపల్ కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న మురుగుడు లావణ్య

# సంక్షేమ పథకాలు అమలు కావాలంటే

# జగనన్న మళ్లీ రావాలి

**ప్రజాశక్తి - మంగళగిరి**

గత ఐదేళ్లలో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ హయంలో ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ఎన్నో ప్రజా సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టి అమలు చేశారని అవి పేద ప్రజలకు ఎంతగానో ప్రయోజనకరంగా నిలిచాయని వైఎస్ఆర్సిపి మంగళగిరి నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థిని మురుడు లావణ్య అన్నారు. ఆ పథకాలు కొనసాగాలంటే జగనన్న మళ్ళీ సీఎం కావాలని ఆమె పేర్కొన్నారు. నగరంలోని 29వ వార్డులో ఆదివారం ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. ఫ్యాన్ గుర్తుపై ఓటు వేయాలని మంగళగిరి ఎమ్మెల్యేగా తనను గెలిపించాలని స్థానికంగా అందుబాటులో ఉండి సమస్యలు పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. జన్మభూమి కమిటీల వలన గతంలో జరిగిన నష్టాన్ని గుర్తు తెచ్చుకోవాలని తెలిపారు. వైసిపి ప్రభుత్వం అధికారం లోకి వస్తేనే సంక్షేమ పథకాలు కొనసాగుతాయని అన్నారు. మాజీ ఎమ్మెల్యే కాండ్రు కమల వైఎస్ఆర్సిపి నాయకులు గంజి చిరంజీవి పార్టీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# ముగిసిని అగ్నిమాపక వారోత్సవాలు

**ప్రజాశక్తి- పొన్నూరు**

స్థానిక అగ్నిమాపక శాఖ కార్యాలయంలో పొన్నూరు ఫైర్ స్టేషన్ ఆఫీసర్ ప్రసాద్ రావు ఆధ్వర్యంలో అగ్నిమాపక వారోత్సవాల ముగింపు వేడుకలు నిర్వహించారు. ముఖ్య అతిథిగా తెనాలి మోటర్ వెహికల ఇనస్పెక్టర్ మధుసూదన రావు మాట్లాడారు. మోటర్ వాహనాల్లో జరిగే అగ్ని ప్రమాదాల నివారణ గురించి విద్యార్థులకు వివరించారు. బాపట్ల ఆర్టీసీ డిపో మేనేజర్ తోట శ్రీనివాసరావు మాట్లా డుతూ అగ్ని ప్రమాదాల గురించి ప్రజలలో చైతన్య పరచటం ఎంతో మంచి పద్ధతి అని కొనియాడారు. కార్యక్రమంలో పొన్నూరు ఆర్టీసి డిపో మేనేజర్ అంజిత కుమారి, వాసవి క్లబ్ అసోసియేషన్ ప్రెసిడెంట్ కిషోర్ గ్యాస్ విద్యుత్ ప్రమాదము ల పై అవగాహన కల్పిస్తూ, అగ్నిమాపక పరికరములను పరిచయం చేస్తూ వాటి యొక్క వివరాలను తెలియపరిచే కర పత్రాలు పంపిణీ చేశారు.

## ఎఎన్‌యు పీజీ సెట్ నోటిఫికేషన్ విడుదల

ప్రజాశక్తి - ఎఎన్‌యు

ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలోని పలు పీజీ కోర్సులకు సంబంధించి సెల్ఫ్ సపోర్టు కేటగిరీ విధానంలో ప్రవేశాలకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు అడ్మిషన్ల డైరెక్టర్ డాక్టర్ జి. అనిత తెలిపారు. ఈ మేరకు ఎఎన్‌యు పీజీ సెట్ 2024 నోటిఫికేషన్ విడుదల చేసినట్లు పేర్కొన్నారు. ఆసక్తి ఉన్న అభ్యర్థులు ఆఫ్ లైన్ విధానంలో దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు. మే 9వ తేదీ వరకు ఎటువంటి ఫైన్ లేకుండా దరఖాస్తులు చేసుకోవాలని పేర్కొన్నారు. వర్సిటీ అందిస్తున్న సెల్ఫ్ సపోర్టు పీజీ కోర్సుల్లో ఎంఎ, ఎం కామ్, ఎంఎస్సీ, ఎంఎ జర్నలిజం, పెర్ఫార్మింగ్ ఆర్ట్స్, ఎమ్ ఎల్ఐ ఎస్ సి, ఎంఈడి, ఎంపీఈ డి వంటి కోర్సులు ఉన్నాయని తెలిపారు. 2024 -25 విద్యా సంవత్సరానికి సంబంధించి ప్రవేశాలు కల్పిస్తామని డాక్టర్ అనిత పేర్కొన్నారు. వివరాలకు యూనివర్సిటీ వెబ్ సైట్ ను సంప్రదించాలని పేర్కొన్నారు. ఈ కోర్సులలో ప్రవేశాలు సెల్ఫ్ సపోర్టు కేటగిరిలో భర్తీ చేయనున్నట్లు వివరించారు.

## 26న పోస్టల్ బ్యాలెట్ దరఖాస్తు గడువు

ప్రజాశక్తి-గుంటూరు

సార్వత్రిక ఎన్నికల ప్రక్రియలో భాగంగా ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు గుంటూరు తూర్పు నియోజకవర్గం పరిధిలో ఎన్నికల ప్రక్రియలో విధులు నిర్వహిస్తున్న ఉద్యోగులు, ఉద్యోగేతరులు (వీడియోగ్రాఫర్స్, డ్రైవర్లు మొదలుగు వారు) వారి ఓటు ఏ నియోజకవర్గంలో ఉన్నా, ఈనెల 26వ తేదీలోపు జిఎంసిలోని పోస్టల్ బ్యాలెట్ హెల్ప్‌డెస్క్‌లో ఫారం-12 సంబంధించిన వివరాలు అందించాలని నగర కమిషనర్, నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి కీర్తి చేకూరి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎన్నికల కమిషన్ తొలుత 22వ తేదీలోపు ఇవ్వాలని ఉత్తర్వులు ఇచ్చిందని, ప్రస్తుతం 26వ తేదీ వరకు గడువు పొడిగించిందని తెలిపారు. కావున ఎన్నికల ప్రక్రియలో విధులు కేటాయించబడిన ప్రభుత్వ ఉద్యోగులు, ఉద్యోగేతరులు వారి ఓటు ఎక్కడ ఉన్నప్పటికినీ పోస్టల్ బ్యాలెట్ ద్వారా తమ ఓటుని సమర్పించవచ్చని పేర్కొన్నారు. పోస్టల్ బ్యాలెట్ కోసం ఈనెల 26వ తేదీలోపు జిఎంసి ప్రధాన కార్యాలయంలో ఏర్పాటు చేసిన పోస్టల్ బ్యాలెట్ హెల్ప్‌డెస్క్‌లో ఫారం-12(2 కాపీలు) అందించాలని తెలిపారు. ఫారం-12తో పాటుగా ఓటర్ ఎపిక్ కార్డ్ కాపీ, డ్యూటీ ఆర్డర్ కాపి తప్పనిసరిగా ఇవ్వాలన్నారు. హెల్ప్ డెస్క్ సిబ్బంది కార్యాలయ పని వేళల్లో ఉదయం 10 గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు విధుల్లో ఉంటారని తెలిపారు.

మాట్లాడుతున్న సుమలత

## టిజెపిఎస్ కాలేజీలో ఇగ్నో ఇండక్షన్ ప్రోగ్రామ్

ప్రజాశక్తి-గుంటూరు

స్థానిక టిజెపిఎస్ కాలేజిలో ఇగ్నో స్టడీ సెంటర్ జనవరి సెషన్ సందర్భంగా నూతన విద్యార్థులకు ఇగ్నో కోర్సులపట్ల అవగాహన కల్పించారు. కళాశాల కాన్ఫరెన్స్ హాల్లో జరిగిన ఈ కార్యక్రమంలో ఇగ్నో కోఆర్డినేటర్ ఎ.భాను మురళీధర్ అధ్యక్షత వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా రీజనల్ సెంటర్ డిప్యూటీ డైరెక్టర్ కె.సుమలత మాట్లాడుతూ ఈ స్టడీ సెంటర్ 1987లో ప్రారంభం అయ్యిందని, ఇగ్నో 500 సెంటర్లలో 58 కోర్సులతో దూర విద్యావిధానంలో ఇగ్నో అగ్రస్థానంలో నిలిచిందన్నారు. ఇగ్నో సాధించిన విజయాలను ఈ సందర్భంగా వివరించారు. విజయవాడ రీజనల్ సెంటర్ ఏర్పాటు చేసిన యూట్యూబ్ ఛానల్‌ను వినియోగించుకోవాలని కోరారు. ఇగ్నో కోఆర్డినేటర్ భాను మురళీధర్ అడ్మిషన్స్ గురించి, టర్మ్ ఎండ్ ఎగ్జామ్స్ గురించి ఫేజ్ పేమెంట్ గురించి, పేపర్ సెలక్షన్స్, స్టడీ సెంటర్ సమయం, కౌన్సిలర్స్ గురించి వివరించారు. కార్యక్రమంలో ఇగ్నో సీనియర్ బివిహెచ్‌కె శాస్త్రి, మేనేజ్‌మెంట్ కోర్సుల గురించి, ఎం.ఎస్.నారాయణ ప్రాజెక్టుల గురించి, పి.భాగ్యలక్ష్మి డిఇసిఇ ప్రోగ్రామ్ గురించి వివరించారు. కార్యక్రమంలో డాక్టర్ కె.కొండయ్య, టిజెపిఎస్ కాలేజి ప్రిన్సిపాల్ ఎబిపి మనోహర్, కళాశాల కార్యదర్శి కె.వి.బ్రహ్మం, డాక్టర్ పి.దేవేంద్రగుప్త, వై.మార్కండేయులు, పి.నాగమణి పాల్గొన్నారు.




గౌస్ చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న నాయకులు

## ఎమ్‌డి గౌస్‌కు యుటిఎఫ్ నాయకుల నివాళి

ప్రజాశక్తి-గుంటూరు : ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్(యుటిఎఫ్) జిల్లా పూర్వ అధ్యక్షుడిగా పనిచేసిన ఎండి.గౌస్ 3వ వర్ధంతి సందర్భంగా ఆదివారం స్థానిక బ్రాడీపేటలోని యుటిఎఫ్ జిల్లా కార్యాలయంలో ఆయన చిత్రపటానికి సంఘ నాయకులు పూలమాలలు వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా యుటిఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బి.ఆదిలక్ష్మి, యం.కళాధర్ మాట్లాడుతూ గౌస్ వృత్తి బాధ్యతలతోపాటు, సంఘ బాధ్యతలను కూడా శక్తివంచన లేకుండా నిర్వహించారని అన్నారు. మండల స్థాయి నుండి జిల్లా స్థాయి వరకూ దాదాపు 35 ఏళ్లపాటు అనేక బాధ్యతలు నిర్వహించారని, జిల్లా అధ్యక్షులుగా కూడా పనిచేశారన్నారు. యుటిఎఫ్ రాష్ట్ర ప్రచురణల కమిటీ చైర్మన్ యం.హనుమంతరావు మాట్లాడుతూ పదవీ విరమణ చేసిన తర్వాత కూడా గౌస్ సంఘ అభివృద్ధికి, పటిష్టతకు ఎంతో కృషి చేశారన్నారు. గౌస్ జీవితం ఉపాధ్యాయులకు, నేటి నాయకులకు ఎంతో ఆదర్శమన్నారు. ఆయన సేవలను కొనసాగిస్తామన్నారు. కార్యక్రమంలో సంఘ నాయకులు జి.వెంకటే శ్వర్లు, యం. గోవిందయ్య, ఎ.ప్రేమ్ కుమార్, బురాన్ తదితరులు పాల్గొని నివాళి అర్పించారు.

# విజ్ఞాన్ హైస్కూల్‌లో కాన్వకేషన్ వేడుకలు

ప్రజాశక్తి-గుంటూరు

స్థానిక ఎల్ఐసీ కాలనీలోని విజ్ఞాన్ హైస్కూల్‌లో కాన్వకేషన్ వేడుకలను శనివారం రాత్రి అత్యంత ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా నగరంలోని ప్రముఖ పిల్లల వైద్య నిపుణులు డాక్టర్ జీ.ధనుంజయరావు, సైకాలజిస్టు డాక్టర్ శ్రీరమ్య హాజరయ్యారు. యూకేజీ నుంచి 5వ తరగతి విద్యార్థులకు గ్రాడ్యుయేషన్ నిర్వహించి ప్రశంసా పత్రాలను విద్యార్థులకు గౌరవ అతిథుల చేతుల మీదుగా అందజేశారు. ఈ సందర్భంగా డాక్టర్ జీ.ధనుంజయరావు మాట్లాడుతూ తల్లిదండ్రులు తమ పిల్లలకు అన్ని వసతులను సమకూర్చడమే కాక వారు చదివేటప్పుడు ఏమి చదవుతున్నారు..? టీవీ చూసేటప్పుడు వారు ఎటువంటి కార్యక్రమాలను చూస్తున్నారో ఒకవైపు గమనిస్తూ ఉండాలన్నారు. సైకాలజిస్టు డాక్టర్ శ్రీరమ్య మాట్లాడుతూ సమాజానికి మంచి పౌరులను తయారు చేసి అందించే బాధ్యత ఉపాధ్యాయులపైన ఉందని, విద్యార్థుల ఉన్నతికి తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల పాత్ర ఎంతో కీలకమని వివరించారు. అనంతరం విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఎంతగానో ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో విజ్ఞాన్స్ జోనల్ ఇంచార్జ్ అనురాధ, ప్రిన్సిపల్ సీహెచ్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

గ్రాడ్యుయేషన్ పట్టాపుచ్చుకున్న చిన్నారులతో అతిథులు

# అభ్యర్థులకు బి ఫారాలు అందించిన చంద్రబాబు

### లావు శ్రీకృష్ణదేవరాయులు, పెమ్మసాని సహా పలువురికి పత్రాలు

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

టిడిపి జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబునాయుడు నుంచి గుంటూరు,పల్నాడు జిల్లాలకు చెందిన టిడిపి అభ్యర్థులు ఆదివారం మంగళగిరి పార్టీ కార్యాలయంలో బి.ఫారాలను అందు కున్నారు. అభ్యర్థుల చేత చంద్రబాబు ప్రతిజ్ఞ చేశారు. బి.ఫారం అందుకున్న వారిలో గుంటూరు పార్లమెంట్ అభ్యర్థి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్, నర్సరావు పేట లోక్‌సభ అభ్యర్థి లావు శ్రీకృష్ణదేవరాయులు, మంగళగిరి అభ్యర్థి నారా లోకేష్, పొన్నూరు అసెంబ్లీ అభ్యర్థి ధూళిపాళ్ల నరేంద్ర, గుంటూరు పశ్చిమ అభ్యర్థి పిడుగురాళ్ల మాధవి, ప్రత్తిపాడు నియోజకవర్గ అసెంబ్లీ టిడిపి అభ్యర్థి బూర్ల రామాంజనేయులు, తాడికొండ టిడిపి అభ్యర్థి తెనాలి శ్రావణ్ కుమార్, గుంటూరు తూర్పు టిడిపి అభ్యర్థి మహమ్మద్ నశీర్ అహ్మద్ తదితరులు ఉన్నారు.

ప్రజాశక్తి -పొన్నూరు : పొన్నూరు టిడిపి అసెంబ్లీ అభ్యర్థి ధూళిపాళ్ల నరేంద్ర కుమార్‌కు చంద్రబాబు బిఫాం అందజేశారు. తనపై నమ్మకంతో పొన్నూరు నియోజ కవర్గం నుండి 7వ సారి పోటీ చేసే అవకాశం కల్పించిన అధినాయకుడు చంద్రబాబుకు నరేంద్ర కుమార్ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

చంద్రబాబు నుండి బిఫాం అందుకున్న శ్రీ కృష్ణదేవరాయులు, పెమ్మసాని, ధూళిపాళ్ల, గల్లా మాధవి, యరపతినేని తదితరులు

## చంద్రబాబు కుట్రలు ప్రజలకు తెలుసు

### ఎన్నికల ప్రచారంలో విడదల రజిని

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

గత సార్వత్రిక ఎన్నికల్లో బిజెపిపై దుమ్మెత్తి పోసిన టిడిపి అధినేత చంద్రబాబు ఈసారి ఎన్‌డిఏ కూటమిలో చేరడం విడ్డూరంగా ఉందని మంత్రి విడదల రజని మండిపడ్డారు. గుంటూరు నగరంలో ఆదివారం 28, 45 డివిజన్లలో మంత్రి ఇంటింటికీ వెళ్లి ఎన్నికల ప్రచారం చేపట్టారు. మంత్రి మాట్లాడుతూ 2019లో చంద్రబాబు బిజెపి, జనసేనలపై చేసిన విమర్శలు ప్రజలకు గుర్తున్నాయని తెలిపారు. ఒంటరిగా గెలవలేకే పొత్తులు పెట్టుకున్నారని ఎద్దేవా చేశారు. బిజెపితో పొత్తు వల్ల టిడిపి గ్రాఫ్ బాగా పడిపోయిందని సర్వేలు రావడంతో జీర్ణించుకోలేక సిఎం జగన్‌పై రాళ్ల దాడి చేయించారని తెలిపారు. ప్రజాస్వామ్యంలో హింసాత్మక చర్యలకు తావు లేదని, ఎన్నికల కమిషన్ తక్షణం జోక్యం చేసుకుని చంద్ర్‌బాబు, లోకేష్‌లపై చర్యలు తీసుకోవాలని మంత్రి రజిని డిమాండ్ చేశారు. సిఎం జగన్ కు వస్తున్న జనాదరణకు చూసి ఓర్వలేక చంద్ర బాబు దాడులుచేయిస్తున్నారని తెలిపారు. 45వ డివిజన్ లో జరిగిన కార్యక్ర మంలో ఎమ్మెల్యే మద్దాలి గిరి మాట్లాడుతూ పశ్చిమ నియోజక వర్గంలో వైసిపి గెలుపు ఖాయం అన్నారు. మంత్రి రజిని 28వ డివిజన్‌లోని నల్లకుంట, ఎన్జీఓ కాలనీ ప్రాంతాల్లో పర్యటించారు. 28 వ డివిజన్ కార్పొరేటర్ పడాల సుబ్బారెడ్డి, వైసిపి నాయకులు షేక్ సైదా, మాదా రాధా తదితరులు పాల్గొన్నారు.

## యువతను మోసగించిన సిఎం

### ఎన్నికల ప్రచారంలో టిడిపి గుంటూరు తూర్పు అభ్యర్థి నశీర్ అహ్మద్

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

ప్రతిఏటా జాబ్ కేలండర్ విడుదల చేసి ఖాళీగా ఉన్న 2.34 లక్షల ఉద్యోగాలు భర్తీ చేస్తానని అధికారంలోకి వచ్చిన సిఎం జగన్ ఐదేళ్లలో ఒక్క కేలండర్ ఇవ్వకుండా యువతను మోసం చేశారని టిడిపి గుంటూరు తూర్పు అభ్యర్థి నశీర్ అహ్మద్ తెలిపారు. ఆదివారం 2వ డివిజన్ పరమాయకుంట ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు. ఉద్యోగాలు కల్పించకపోవటంతో అనేకమంది వలస బాట పట్టారని, నకిలీ ఇళ్ల పట్టాలతో మహిళలను మోసాగించారని, జగన్ చేసిన హామీలు, వాగ్దానాలు బుట్టదాఖలు చేశారాని పేర్కొన్నారు. ఆడబిడ్డ ల వివాహానికి ఆర్థిక సాయన్ని మరిచాడని, కరెంట్ బిల్లు మోత మోగించాడని దూయ్యబట్టారు. వివిధ డివిజన్లకు చెందిన వైసిపి నాయకులు నశీర్ సమక్షంలో టిడిపిలో చేరారు. మాజీ ఎమ్మెల్యే నంబూరు సుభాని, టిడిపి నాయకులు భరత్ రెడ్డి, మాజీ డిప్యూటీ మేయర్ గౌస్ తదితరులు పాల్గొన్నారు.